పేజీలు :12
వెల :5/-

జాతీయ తెలుగు దినపత్రిక www.mediatodaydaily.com

# మీడియా టుడే

మన మీడియా - మన సమాజం


Published from Hyderabad, Nalgonda, Karimnagar, Warangal, Khammam, Vijayawada, Rajamandri, Chittur, Visakhapatnam prakasham

సంపుటి : 01 సంచిక : 141 శుక్రవారం 6-3-2026 పేజీలు 12 వేల 5/-


# 'రాజ్యసభ' ఏకగ్రీవమే!

## రెండు స్థానాలకు ముగ్గురి నామినేషన్‌లు

- కాంగ్రెస్ తరపున సింఘ్వి, వేం నరేందర్ రెడ్డి
- స్వతంత్ర అభ్యర్థిగా సాయి అనే వ్యక్తి నామినేషన్
- ఎమ్మెల్యేల సంతకాలు లేనందున తిరస్కరణ!
- రాజ్యసభకు బిహార్ సీఎం నితీశ్ నామినేషన్
- పట్నాలో అమిత్ షా సమక్షంలో దాఖలు
- 16న ఫలితాల తర్వాత నితీశ్ రాజీనామా
- మేలో కేంద్ర క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణ
- నితీశ్‌కు కేంద్ర పదవిపై రాజకీయ వర్గాల్లో చర్చ



హైదరాబాద్, మార్చి 5 మీడియా టుడే

తెలంగాణలోని రెండు రాజ్యసభ స్థానాలు ఏకగ్రీవం కానున్నాయి. ఏప్రిల్‌లో ఖాళీ కాబోయే రెండు రాజ్యసభ స్థానాలకు ఇటీవల కేంద్ర ప్రభుత్వం ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన సంగతి తెలిసిందే. గురువారంతో నామినేషన్ల ప్రక్రియ ముగిసింది. కాంగ్రెస్ తరపున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వి, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. అసెంబ్లీలో ఏర్పాటుచేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం.. రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు డి.శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, సహా పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతోపాటు, ఎంఐఎంకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అభిషేక్ మూడు సెట్లు, నరేందర్‌రెడ్డి నాలుగు సెట్ల చొప్పున నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందించారు. కాగా.. సాయి అనే వ్యక్తి కూడా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయడంతో రెండు రాజ్యసభ స్థానాలకు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. అయితే స్వతంత్ర అభ్యర్థిగా సాయిని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం స్క్రూటినీ దశలోనే ఆ నామినేషన్ తిరస్కరణకు గురవనుంది. మరే ఇతర పార్టీ నుంచి ఈ స్థానాలకు నామినేషన్లు దాఖలు కాకపోవడంతో వేం నరేందర్ రెడ్డి, సింఘ్వీలే ఏకగ్రీవంగా ఎన్నిక కానున్నారు. పోటీ ఉంటే మార్చి 16న ఎన్నిక జరిగేది. కానీ రెండు స్థానాల్లో కాంగ్రెస్ మినహా ఇతర పార్టీలు పోటీలో లేకపోవడంతో ఉపసంహరణ గడువు నాడే.. అంటే మార్చి 9నే, ఉపసంహరణ ప్రక్రియ సమయం పూర్తయిన తరువాత.. ఎన్నికైన అభ్యర్థులను ఏకగ్రీవంగా ప్రకటించనున్నారు. కాగా.. పార్టీ అధినాయకత్వం సలహా, సూచనల మేరకు సరైన ఇద్దరు సీనియర్ నాయకులను రాజ్యసభఎన్నికల్లో నామినేషన్ వేసేందుకు ఎంపిక చేశామని పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ తెలిపారు. నామినేషన్లు వేసిన సింఘ్వీ, వేం నరేందర్‌కు ఆయన అభినందనలు తెలియజేశారు. ఎంపీలుగా..రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం వారిద్దరూ కృషి చేస్తారని ఆశిస్తున్నామని పేర్కొన్నారు.

### సంతోషంగా ఉంది: సింఘ్వీ

రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ వేయడం కంటే కూడా.. గాంధీ భవన్‌కు రావడం సంతోషంగా ఉందని అభిషేక్ మను సింఘ్వీ అన్నారు. నామినేషన్ ప్రక్రియ అనంతరం ఆయన గాంధీ భవన్‌కు వెళ్లారు. "పార్టీకి చిహ్నం గాంధీ భవన్. పార్టీ లేకుండా ప్రభుత్వం లేదు. అలాంటి పార్టీ ఆఫీసుకు రావడం ఆనందంగా ఉంది. తెలంగాణ నుంచి రెండోసారి రాజ్యసభకు వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నా" అని పేర్కొన్నారు.

### నిధుల కోసం పోరాడుతా: వేం

రాజ్యసభ అభ్యర్థిగా తనకు అవకాశం కల్పించిన ఏఐసీసీ పెద్దలు, రాష్ట్ర నేతలకు వేం నరేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఇన్నాళ్లూ ఎలా పనిచేశానో, భవిష్యత్‌లోనూ అలాగే పనిచేస్తానని ఆయన పేర్కొన్నారు. కేంద్ర నుంచి రావాల్సిన నిధులు, రాష్ట్ర సమస్యల పరిష్కారం కోసం రాజ్యసభలో పోరాడుతానన్నారు.

# సాంకేతికతలో మరింత సహకారం!

**అవగాహనా ఒప్పందాలపై భారత్, ఫిన్లాండ్ సంతకాలు**

**ఫిన్లాండ్ అధ్యక్షుడు స్టబ్‌తో మోదీ ద్వైపాక్షిక చర్చలు**




న్యూఢిల్లీ, మార్చి 5: మీడియా టుడే

డిజిటలైజేషన్, శుద్ధ ఇంధనం, క్వాంటం కంప్యూటింగ్, సెమీకండక్టర్లు తదితర అత్యాధునిక సాంకేతిక అంశాల్లో సహకారాన్ని విస్తరించడంతోపాటు రక్షణ, అంతరిక్ష రంగాల్లో లోతైన భాగస్వామ్యంపై భారత్, ఫిన్లాండ్ ఒప్పందాలు చేసుకున్నాయి. భారత్‌కు విచ్చేసిన ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్ర మోదీ గురువారం ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఆ వివరాలను సం యుక్త ప్రకటనలోనూ, విలేకరుల సమావేశంలోనూ ఇరువురు నేతలు వెల్లడించారు. ఆయా అంశాల్లో ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను వ్యూహాత్మక భాగస్వామ్యం దశకు తీసుకెళ్లాలని నిర్ణయించామని మోదీ తెలిపారు. ఉక్రెయిన్ అయినా, పశ్చిమాసియా అయినా యుద్ధం ముగించాలనే తాము పిలుపు ఇస్తున్నామని మోదీ చెప్పారు. ఐక్యరాజ్య సమితికి చెందిన భద్రతామండలిలో భారతదే శానికి శాశ్వత సభ్యత్వం కల్పించాలని అలెగ్జాండర్ స్టబ్ బలంగా గళం వినిపించారు. ప్రస్తుత భౌగోళిక రాజకీయ పరిస్థితుల్లో ప్రపంచ బహుపాక్షిక వ్యవస్థల్లో సంస్కరణలు అవసరమన్నారు. ఇదే విషయాన్ని రైజినా చర్చలు–2026లో పునరుద్ఘాటిస్తానని చెప్పారు.

# ఖమేనీ మృతికి సంతాపం తెలిపిన భారత్


**ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లినవిదేశీ వ్యవహారాల కార్యదర్శి**

న్యూఢిల్లీ, మార్చి 5:మీడియా టుడే

ఇరాన్ సుప్రీంలీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతికి గురువారం భారత్ సంతాపం తెలిపింది. భారత విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లి సానుభూతి తెలిపారు. అక్కడ ఉన్న సంతాప సందేశాల పుస్తకంలో భారత ప్రభుత్వం తరఫున సంతాప సందేశం రాసి సంతకం చేశారు. భారత్‌లోని ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలితో మాట్లాడారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను విదేశీ వ్యవహారాల శాఖ విడుదల చేసింది. గత నెల 28న అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఖమేనీ మరణించారు. చర్చలు, దౌత్య మార్గాల ద్వారా సంక్షోభాన్ని పరిష్కరించుకోవాలని భారత్ పిలుపునిచ్చినప్పటికీ ఖమేనీ హత్యపై మాత్రం స్పందించలేదు. ఖమేనీ మృతి పట్ల ప్రభుత్వం తరఫున స్పందించనందుకు ప్రతిపక్షాలు విమర్శించాయి.

# మాది వికాసం.. కాంగ్రెస్‌ది విధ్వంసం

**పేదల ఇళ్లు కూలగొడితే బుల్డోజర్లకు అడ్డుపడతాం: కేటీఆర్**



హైదరాబాద్ సిటీ, మార్చి5 మీడియా టుడే

విధ్వంసం.. అరాచకం లేకుండా మూసీని అభివృద్ధి చేయవచ్చని, కాంగ్రెస్‌కు చేతగాకపోతే తామే చేసి చూపిస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్‌రెడ్డికి సవాల్ విసిరారు. బీఆర్ఎస్ మోడల్‌లో వికాసం ఉంటే కాంగ్రెస్ విధానాల్లో విధ్వంసం ఉందన్నారు. మూసీ సుందరీకరణకు రూ.1.50 లక్షల కోట్ల వ్యయం చూపుతున్నారని, కేవలం రూ.16వేల కోట్లతో పనులు పూర్తి చేయవచ్చన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత తమకు అప్పగిస్తే తక్కువ ఖర్చుతో పూర్తి చేస్తామన్నారు. మూసీ పేరుతో ఆయన చేస్తున్న లూటీని అడ్డుకుంటామన్నారు. గురువారం మూసీ పరివాహక ప్రాంతంలో బీఆర్ఎస్ సీనియర్ నేతలతో కలిసి పర్యటించిన కేటీఆర్ తొలుత నాగోల్‌లోని ఎస్టీపీని సందర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మూసీ పేరిట హైదరాబాద్‌లో సృష్టిస్తున్న విధ్వంసాన్ని రానున్న అసెంబ్లీ సమావేశాల్లో లేవనెత్తుతామన్నారు. రేవంత్‌రెడ్డి చేస్తున్నది మూసీ బ్యూటిఫికేషన్ కాదని లూటిఫికేషన్ అని ఎద్దేవా చేశారు. కేవలం రూ.16వేల కోట్లతో మొత్తం మురుగుశుద్ధి చేయడంతో పాటు కొండపోచమ్మ నుంచి మంచి నీళ్లను మూసీలోకి తేవడం, రెండు వైపులా స్కైవేల నిర్మాణం వంటి అన్ని కార్యక్రమాలతో డీపీఆర్ ప్రభుత్వానికి అందుబాటులో ఉంద న్నారు. అయినా అవినీతి సంపాదన కోసం రేవంత్ రెడ్డి ఈ మూసీ ప్రాజెక్టును ఎత్తుకున్నారని విమర్శించారు. స్వయంగా రేవంత్‌రెడ్డి కొస్గిలోని తన ఇంటిని రెడ్డికుంటలో నిర్మించారని, ఆయన తమ్ముడు తిరుపతిరెడ్డి దుర్గంచెరువు ఎఫ్‌టీఎల్‌లో ఇంటిని నిర్మిస్తే.. అక్కడికి బుల్డోజర్లు ఎందుకు రావన్నారు. హిమాయతసాగర్ మధ్యలో మంత్రులు పొంగులేటి, వివేక్, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, కేవీపీలు నిర్మించిన ఇళ్లను కూలగొట్టే దమ్ము హైడ్రాకు ఉందా అని నిలదీశారు.

# ఏసీబీకి చిక్కిన జీహెచ్ఎంసీ అధికారి


సికింద్రాబాద్, మార్చి 5 మీడియా టుడే

రిటైర్మెంట్ బెనిఫిట్ల ఫైల్‌ను అధికారులకు పంపడానికి లంచం డిమాండ్ చేసిన జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ ఎగ్జామినర్ అకౌంట్స్ మేనేజర్ సంతోష్ కుమార్ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడిన ఘటన గురువారం వెలుగు చూసింది. ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోన్ కార్యాలయంలో నాల్గో తరగతి ఉద్యోగిగా పని చేసి గతేడాది అక్టోబరులో రిటైరైన ఆంజనేయులు తనకు రావాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్ల కోసం దరఖాస్తు చేశాడు. కానీ, ఐదు నెలలు కావస్తున్నా.. తన రిటైర్మెంట్ బెనిఫిట్ల ఫైల్ కదలకపోవడంతో బుధవారం ఆంజనేయులు సికింద్రాబాద్ జోన్ కార్యాలయానికెళ్లి ఎగ్జామినర్ అకౌంట్స్ మేనేజర్ సంతోషకుమార్‌ను కలిశాడు. సదరు ఫైల్‌ను అధికారులకు పంపాలంటే తనకు రూ.40 వేలు లంచం ఇవ్వాలన్న సంతోషకుమార్‌తో తానంత ఇవ్వలేనని రూ.35 వేలు ఇవ్వడానికి ఒప్పుకున్నాడు. కానీ, లంచమివ్వడం ఇష్టం లేని ఆంజనేయులు ఏసీబీని సంప్రదించాడు. వారి సూచన మేరకు జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ కార్యాలయంలో గురువారం సాయంత్రం 4 గంటలకు సంతోష్ కుమార్‌కు ఆంజనేయులు డబ్బు ఇస్తుండగా ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

# ముగ్గురు ముద్దు..

## మూడో బిడ్డను కంటే 25 వేల ప్రోత్సాహకం..

- బిడ్డ పోషణకు ఐదేళ్ల పాటు నెలకు 1000 సాయం
- ఏప్రిల్ 1 నుంచి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ
- 18 ఏళ్ల వరకు ఉచిత విద్య.. ముగ్గురు, అంతకంటే
- ఎక్కువ మందిని కనే ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు
- తల్లికి 12 నెలలు.. తండ్రికి 2 నెలలు మంజూరు
- సంతాన సాఫల్య రేటు 2.1కి తీసుకెళ్లడమే లక్ష్యం
- చైల్డ్ కేర్ సెంటర్లు, వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల ఏర్పాటు
- భవిష్యత్తులో అధిక జనాభా భారం కాదు.. సంపద
- ఎంతో దూరదృష్టితో ఆలోచించే ముసాయిదా
- దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో నూతన విధానం
- శాసనసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటన



అమరావతి, మార్చి 5 మీడియా టుడే

'మేమిద్దరం... మాకిద్దరు!' 'ఇద్దరు ముద్దు... ముగ్గురు వద్దు!' 'చిన్న కుటుంబం... చింతల్లేని కుటుంబం!' ఈ నినాదాలకు కాలం చెల్లింది! 'కుటుంబ నియంత్రణ' కాలం పోయింది. 'ఒక్కరితో ఆగొద్దు! ముగ్గురైతే మరింత ముద్దు'... అని ప్రభుత్వమే పిలుపునిస్తోంది. అంతేకాదు... మూడో బిడ్డ జన్మించగానే పాతికవేల నగదు కానుక! ఇంకా రకరకాల ప్రోత్సాహకాలు! ఇదీ ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా ప్రకటించిన 'పాపులేషన్ మేనేజ్‌మెంట్' విధానం! మూడో సంతానాన్ని కంటే రూ.25 వేల ప్రోత్సాహకంతో పాటు 'పోషణ, శిక్షా–సురక్ష' ప్యాకేజీ కింద ఆ బిడ్డ పోషణకు ఐదేళ్ల పాటు నెలకు రూ. 1,000 చొప్పున సాయం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. అంతేగాక 18 ఏళ్ల వరకు ఉచిత విద్య అందిసామని చెప్పారు. 'జనాభా నిర్వహణపై ప్రభుత్వం రూపొందించిన ముసాయిదా పాలసీ'పై గురువారం శాసనసభలో ప్రకటన చేశారు. రాష్ట్రంలో జనాభా పెంపు ఆవశ్యకత గురించి వివరించారు. 'గతంలో జనాభా పెరిగితే ఏమవుతుందోనని ఆందోళన చెందేవారం. ఇప్పుడు మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలను మార్చుకో వలసిన అవసరం ఏర్పడింది. ఇన్నాళ్లూ కుటుంబ నియంత్రణకు ప్రాధాన్యమిచ్చాం. ఇకపై జనాభాను పెంచుకోవాల్సిన అవసరం ఉంది. జనాభా పెరుగుదల భారం కాదు.. సంపద. అందుకే దేశంలోనే తొలిసారిగా రాష్ట్రంలో 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ'ని ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తాం. మాతృత్వం, శక్తి, క్షేమం, నైపుణ్యం, సంజీవని.. అనే ఐదు అంశాలు మూలస్తంభాలుగా ఈ పాలసీని అమలు చేస్తాం. అందరికీ అందుబాటులో ఉండేలా ఆన్‌లైన్‌లో పెడుతున్నాం. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో నెల రోజుల పాటు ప్రజాప్రతినిధులు ప్రజల్లోకి వెళ్లి ఈ అంశంపై విస్తృతంగా చర్చించాలి. జనాభా నిర్వహణపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తాం. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత ఈ నెలాఖరు నాటికి పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీకి తుది రూపం ఇస్తాం. ఏప్రిల్ 1 నుంచి అమలులోకి తీసుకు వస్తాం. ఏడాది కాలంలో వచ్చిన ఫలితాలను పరిశీలించిన తర్వాత పాలసీలో అవసరమైన మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. 'హెల్తీ, వెల్దీ, హ్యాపీ ఏపీ' లక్ష్యం పాపులేషన్ మేనేజ్‌మెంట్‌తోనే సాధ్యం" అని చంద్రబాబు తెలిపారు.

### 'పాలసీ'.. ఎందుకంటే


"జపాన్, దక్షిణ కొరియా, ఇటలీ వంటి దేశాల్లో ఫెర్టిలిటీ రేటు తగ్గిపోతోంది. జనాభా తగ్గిపోయి చైనా ఇంకా ఇబ్బందులు పడుతోంది. భారత్, ముఖ్యంగా ఏపీలో కూడా అలాంటి పరిస్థితే నెలకొంది. 1992–93లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం ఫెర్టిలిటీ రేటు (టీఎ?ఫఆర్) 3.0గా ఉండేది. ఇప్పుడు 1.5 మాత్రమే ఉంది. దీనిని 2.1కి పెంచాలనేది లక్ష్యం. టీఎ?ఫఆర్ వేగంగా తగ్గితే వర్క్‌ఫోర్స్ పడిపోతుంది. రాష్ట్ర ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. ప్రభుత్వం పట్టించుకోకపోతే భవిష్యత్తులో మరింత నష్టం వాటిల్లుతుంది. 2023 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఏడాదికి 6.70 లక్షల జననాలు మాత్రమే ఉంటున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే 2047 నాటికి రాష్ట్ర జనాభాలో 23 శాతం మంది వృద్ధులే ఉంటారు. ఉమెన్ వర్క్‌ఫోర్స్ గణనీయంగా తగ్గిపోతోంది. ఈ గ్యాప్‌ను పూడ్చడానికే పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీకి రూపకల్పన చేశాం. 'ఒకరు ముద్దు.. ఇద్దరు ఓకే.. ముగ్గురు వద్దు' అని గతంలో చెప్పాం. ఇప్పుడు 'ఒక్కరు వద్దు.. ఇద్దరు ఓకే.. ముగ్గురు ముద్దు' అనే నినాదంతో ముందుకు వెళ్తున్నాం. మూడో సంతానం, ఆపైన పిల్లలను కనే ఉద్యోగులైన తల్లిదండ్రులిద్దరికీ పిల్లల సంరక్షణలో సమ బాధ్యతల కోసం తల్లికి 12నెలలు సెలవుతో పాటు అదనంగా తండ్రికి 2 నెలలు సెలవు ఇవ్వాలని ప్రతిపాదిస్తున్నాం. '2047 నాటికి రాష్ట్రంలో వృద్ధుల జనాభా 23 శాతం ఉంటుందని అంచనా. వృద్ధుల సంరక్షణకు ప్రతి జిల్లాలో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేస్తాం. 175 కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రాల్లో రెండు వారాలకు ఒకసారి ప్రత్యేక క్లినిక్ నిర్వహిస్తాం."

## తెలంగాణ గవర్నర్‌గా శివప్రతాప్ శుక్లా

- మహారాష్ట్రకు బదిలీ అయిన జిష్ణుదేవ్ వర్మ
- బెంగాల్ గవర్నర్‌గా ఆర్ఎన్ రవి నియామకం
- తమిళనాడు, హిమాచల్‌కు కూడా కొత్త గవర్నర్లు
- ఢిల్లీ, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్లు కూడా మార్పు


న్యూఢిల్లీ, మార్చి 5 : మీడియా టుడే

తెలంగాణ నూతన గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా నియమితులయ్యారు. ప్రస్తుత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మహారాష్ట్ర గవర్నర్‌గా నియమించిన ప్రభుత్వం.. ఆయన స్థానంలో హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు తెలంగాణ బాధ్యతలు అప్పగించింది. తెలంగాణతో పలు రాష్ట్రాల గవర్నర్లు గురువారం బదిలీ అయ్యారు. ఇందుకు సంబంధించిన రాష్ట్రపతి భవన్ గురువారం రాత్రిర పొద్దుపోయిన తర్వాత ఓ ప్రకటన విడుదల చేసింది. దాని ప్రకారం ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాను లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులయ్యారు. అలాగే, తమిళనాడు గవర్నర్ ఆర్ ఎన్ రవిని పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా, కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడు గవర్నర్‌గా, లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్తాను హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా నియమించారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా తరణ్ జిత్ సంధూను నియమించారు. కాగా, త్రిపుర మాజీ ఉప ముఖ్యమంత్రి జిష్ణుదేవ్ వర్మను 2024లో తెలంగాణ గవర్నర్‌గా నియమించిన విషయం తెలిసిందే. కాగా ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివప్రతాప్ శుక్లా.. ప్రధాని మోదీ తొలి మంత్రివర్గంలో ఆర్థిక శాఖ సహాయమంత్రిగా పని చేశారు. 2023 నుంచి హిమాచల్ గవర్నర్‌గా ఉన్న శుక్లాను ఇప్పుడు తెలంగాణకు బదిలీ చేశారు.పశ్చిమ బెంగాల్ గవర్నర్ సీవీ ఆనంద్ బోస్ గురువారం రాజీనామా చేయగా తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని ప్రభుత్వం బెంగాల్ గవర్నర్‌గా నియమించింది. అయితే, పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ మరికొద్ది రోజుల్లో వెలువడనున్న వేళ జరిగిన ఈ మార్పుపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమత బెనర్జీ తీవ్రంగా స్పందించారు. సీవీ ఆనంద్ బోస్ రాజీనామాపై ఆశ్చర్యం వ్యక్తం చేసిన మమత.. కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఒత్తిడి వల్లే ఆయన ఈ నిర్ణయం తీసుకుని ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు.



# అలసకాని రామారావు మామయ్య మరణం బాధాకరం

## -సర్పంచ్ భవాని



**కోదాడ, మార్చి 05 (మీడియా టుడే)-:** మండల పరిధిలోని నల్లబండ్ల గూడెం గ్రామానికి చెందిన అలసగాని రామారావు మామయ్య మరణం బాధాకరమని మా కుటుంబానికి తీరనిలోటని నల్లబండగూడెం గ్రామ సర్పంచ్ అలసాగాని భవాని శరభేశ్వరరావు అన్నారు గురువారం రామారావు దశదిశకర్మ సందర్భంగా నల్లబండగూడెం రామారావు నివాస గృహంలో నిర్వహించిన సమస్మరణ సభలో రామారావు చిత్రపటానికి స్థానిక నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం ఆమె మాట్లాడుతూ నా భర్త సర్వేశ్వరరావు తండ్రి రామారావుని కోల్పోవటం మా కుటుంబానికి తీరని లోటు అని ఆయన జ్ఞాపకాలు ఎన్నటికీ మరువలేమని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు, షిరిడి సాయిబాబా మందిరం చైర్మన్ నల్లపాటి నరసింహారావు ఎర్రవరం బాల ఉగ్ర నరసింహ స్వామి దేవాలయం చైర్మన్ నల్లజాల జగన్నాథం, వక్క వంతుల నాగార్జున, దొరకుంట గ్రామ సర్పంచ్ పాలకి సురేష్ బెంజిమెన్. కోదాడ మున్సిపల్ కౌన్సిలర్లలు గుండపనేని పద్మ నాగేశ్వరరావు తోట జ్యోతి శ్రీనివాస్, విశ్రాంతి ఉద్యోగుల జిల్లా నాయకులు బొల్లురాంబాబుకుమారులు అలసగాని శ్రీనివాసరావు సుజాత, అలసగాని శరభేశ్వరరావు భవాని ,కుటుంబ సభ్యులు వివిధ గ్రామాల కాంగ్రెస్ నాయకులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి ఇంటిపై దాడి

## చంపేస్తామని బెదిరించారని ఆవేదన.. బోగ శ్రావణి

**జగిత్యాల మీడియా టుడే-మార్చి 4**

జగిత్యాలలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీజేపీ నాయకురాలు భోగ శ్రావణి ఇంటిపై కొందరు వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. తనను, తన కుటుంబ సభ్యులను చంపేస్తామని బెదిరించారని శ్రావణి కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ఘటన స్థానికంగా కలకలం రేపింది.జగిత్యాల పట్టణంలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి నివాసం వద్ద ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పార్టీలో సస్పెండ్ అయిన కొందరు వ్యక్తులు, మరికొందరు సీనియర్ కార్యకర్తలమని చెప్పుకుంటూ తన ఇంటికి వచ్చి బీభత్సం సృష్టించారని ఆమె ఆరోపించారు. నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, కుర్చీలు, గ్రీన్ మ్యాట్లను దుండగులు ధ్వంసం చేశారని ఆమె తెలిపారు.ఒక మహిళ అని కూడా చూడకుండా తన ఇంటిపైకి వచ్చి బూతులు తిడుతూ, తనను, తన భర్తను చంపేస్తామని బెదిరించారని జగిత్యాలలో మిమ్మల్ని బతకనివ్వమని హెచ్చరిం చారనీ. పార్టీ కోసం క్రమశిక్షణతో పని చేస్తున్న దాడులు జరగడం అత్యంత దురదృష్టకరం. ప్రజా స్వామ్యం ఎటు పోతోంది అన్నారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. సీఐ, ఎస్ఐలు సకాలంలో స్పందించి దాడికి పాల్పడిన వారిని అక్కడి నుండి పంపించి వేశారని శ్రావణి పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన దృశ్యాలు సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయని, వెంటనే కలెక్టర్ మరియు ఎస్పీ గారు స్పందించి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.



# ఎస్సి ఎస్టీ కేసులు నమోదు అయిన వారిని పోలీసులు వెంటనే అరెస్ట్ చెయ్యాలి

## ఎమ్మార్పిస్ జిల్లా నాయకులు డిమాండ్



**జగిత్యాల మీడియా టుడే-మార్చి 4**

జగిత్యాల జిల్లా బీరుపూర్ మండల్ తుంగూర్ గ్రామం బీసీ గౌడ వర్గానికి చెందిన 7 గురు వ్యక్తులపై ఎస్సి ఎస్టీ కేసులు నమోదు అయిన విషయం తెలిసిందే. డి.ఎస్పీ ఎంక్వయిరీ కూడ అయ్యింది పోలీసులు వారిని తక్షణమే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని ఎమ్మార్పిస్ నాయకులు డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్పిస్ జిల్లా కన్వీనర్ దుమాల గంగారాం మాదిగ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ తుంగూర్ గ్రామానికి చెందిన చుంచు రాధ భర్త (క్రీ.శే రాములు) ఆమెకు గత కొన్ని ఏండ్లు నుండి పరిచయం ఉన్నటువంటి కాంతమ్మ అనే వ్యక్తిని మా సొంత పని ఉంది కొంచం వచ్చి సహాయం చేయు అని కాంతమ్మను అనగానే సరే వస్తా అని తుంగూర్ వెళ్లారు. అయితే తుంగూర్ గ్రామానికి చెందిన చుంచు రాధ కు 212ఇ /1 లో 6 గుంటల స్థలం ఉండేది. ఆ స్థలంలో శీలం శ్రీనివాస్ గౌడ అక్రమంగా కబ్జా చేసి రేకుల షెడ్ వేసి బేస్మెట్ గోడ నిర్మించారు. అందులో అక్రమంగా నిర్మించిన షెడ్ ను తొలగించడానికి రాధ కుటుంబ సభ్యులతో పాటు పరిచయం ఉన్నటువంటి కాంతమ్మను కూడ కొంచం సాయం చేయండి అని అనడంతో ఫిబ్రవరి 13 తారీఖున షెడ్ తొలగించంగా అక్రమంగా నిర్మాణం చేసిన శీలం శ్రీనివాస్ గౌడ్ తన అనుచరులతో డాడీకి పాల్పడ్డారు. రాధ కు మీరూ ఎందుకు సాయం చేస్తున్నారు అని కులం పేరుతో నానా బూతులు తిట్టుతూ చేతిలో ఉన్న సెల్ ఫోన్ ను లాగేసి నోటికి ఇష్టం వచ్చినట్లు తిడుతూ డాడీకి దిగి మాదిగ కులం పేరుతో శీలం శ్రీనివాస్ అతని భార్య దేవేంద్ర, ఎండపల్లి నారాయణ, బట్టల చంద్రయ్య అతని భార్య విజయ, పూర్ణ చందర్ అతని భార్య ఆమెపై దూశించారు. వీరిపై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయగా ఎస్సి ఎస్టీ కేసులు నమోదు అయ్యాయి. వీరిని వెంటనే పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పిస్ నాయకులు బెజ్జంకి సతీష్ మాదిగ, అనిల్ మాదిగ, సునీల్ మాదిగ, కిషన్ మాదిగ బాధితులు పాల్గొన్నారు.

# బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలి

## ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

**కరీంనగర్ మీడియా టుడే మార్చి5:**

తిమ్మాపూర్ మండలం నల్లగొండ గ్రామంలో జరుగుతున్న శ్రీ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను ధర్మకర్తలు,అధికారులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని మానకొండూర్ శాసనసభ్యుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. గురువారం శ్రీ లక్ష్మీనర్సింహస్వామి వారిని దర్శించుకొని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్మించిన ప్రహరీ గోడను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నల్లగొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు-జాతరకు జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారని, ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు సమకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ బండారుపలెల్లి లక్ష్మణ్, కార్యనిర్వహణాధికారి నాగుల అనిల్ కుమార్, ధర్మకర్తలు గాజుల అంజయ్య, బుత్కూరి శ్రీనివాస్, కందుకూరి లక్ష్మిరాజం చారి, జినుక శ్రీనివాస్, కవ్వంపల్లి మహేష్, గోలి లక్ష్మి,




తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బండారి మల్లేశం, మాజీ అధ్యక్షుడు మోరపల్లి రమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోగూరి నర్సింహారెడ్డి, జిల్లా పార్టీ కార్యదర్శి మామిడి అనిల్ తోపాటు భక్తులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యసభ కాంగ్రెస్ అభ్యర్థులు సింఘ్వీ, నరేందర్ రెడ్డిలకు కవ్వంపల్లి అభినందనలు

**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్: మీడియా టుడే, మార్చి 05 :**

తెలంగాణ నుంచిరాజ్యసభకు కాంగ్రెస్ అభ్యర్థులుగా ఖరారైన సిటింగ్ ఎంపీ అభిషేక్ మను సింఘ్వీ, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిని టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షులు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వం సత్యనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు .అంతే కాకుండా గురువారం వారు హైదరాబాదులో నామినేషన్లు దాఖలు చేయగా, ఈ కార్యక్రమంలోనూ రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రభృతులతో కలిసి డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



# పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టిన సీతారాం

**నూతన సిఐ సీతారాంకు బాధ్యతలు అప్పగించిన సిఐ విజయ కుమార్**

**శాంతిభద్రతల పరిరక్షణ మా ప్రథమ కర్తవ్యం - సీఐ సీతారాం**

**మీడియా టుడే షాద్ నగర్ మార్చ్ 05**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ సిఐ గా కె. సీతారాం గురువారం బాధ్యతలు చేపట్టారు. ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిలో కందుకూర్ సిఐగా ఒకటిన్నర సంవత్సరంగా విధులను నిర్వహిస్తున్న సీఐ సీతారాం బదిలీపై షాద్ నగర్ పట్టణ సిఐ గా వచ్చారు. 2002 బ్యాచ్ కి చెందిన సిఐ సీతారాం ఉమ్మడి జిల్లాలో గుంటూరు ఏసీబీ లో , నిజామాబాద్ జిల్లాలో వివిధ ర్యాంకులలో పనిచేశారు. ఇక్కడ విధులను నిర్వహించిన పట్టణ సీఐ విజయ్ కుమార్ ను ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ కు అటాచ్ చేస్తు సిపి జి. సుధీర్ బాబు ఆదేశాలను జారీ చేశారు. నూతన సిఐ కి శుభాకాంక్షలు తెలియజేసిన డిఐ వెంకటేశ్వర్లు..

# విద్యార్థులే అన్నీ అయి నమూనా ఎన్నికల ప్రక్రియ

**( మీడియా టుడే గరిడేపల్లి )**



మన భారత దేశంలో 18 సంవత్సరములు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కునుకల్పించి నడాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిరస్మరణీయులు. అని ఎంఈఓ చ్ఛత్రు నాయక్ అన్నారు గురువారం గరిడేపల్లి మండల కేంద్రం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల పాఠ్యాంశంలో భాగంగా నిర్వహించినటువంటి మాక్ పోల్ (నమూనా ఎన్నికల ప్రక్రియ)ను ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ఈ విధంగా నిర్వహించడం వలన విద్యార్థులకు ఎన్నికల పైన అవగాహన కలుగుతుందని , భవిష్యత్తులో ఎలాంటి వ్యక్తులను వారి ప్రతినిధులుగా ఎన్నుకోవాలని తెలుస్తుందని అన్నారు. విద్యార్థులే (పిఓ) గా,(ఏ,పీ,ఓ,)గా, (ఓ, పి, ఓ,)గా వారి బాధ్యతను చక్కగా నిర్వహించారు అన్నారు. అంతేగాక విద్యార్థులు పౌరుల్లాగా ఓట్లు వేశారని,సాయంత్రం కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించి విజేతలను ప్రకటించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సాయిల్ సారు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# రామకృష్ణలో ఎంప్లాయ్మెంట్ రిజిస్ట్రేషన్ మేళా

**జగిత్యాల మీడియా టుడే- మార్చి 4**




స్థానిక రామకృష్ణ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో గురువారం జిల్లా ఉపాధి మరియు శిక్షణ శాఖ వారి ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉపాధి కల్పన నమోదు కార్యక్రమం తోపాటు ,కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించినారు. ఈ కార్యక్ర మంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి సత్తెమ్మ పాల్గొని విద్యార్థులకు ఎంప్లాయిమెంట్ కార్డు ద్వారా లభించే ప్రయోజనాలను, మరియు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ఉద్యోగ అవకాశాలను, వాటి సాధనకు ప్రణాళిక బద్ధమైన శిక్షణ ఏ విధంగా కొనసాగించాలి అనే అంశంపై ప్రసంగించి పలు సూచనలు చేశారు. ఎంప్లాయిమెంట్ కార్డు నమోదు చేసుకున్నవిద్యార్థులకు రిజిస్ట్రేషన్ ధృవపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కొక్కుల రాజేందర్, అధ్యాపక బృందం మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# టేక్మాల్ మండలం తంపులూరు గ్రామంలో శివపార్వతుల కల్యాణోత్సవం

**టేక్మాల్ : మార్చ్ 5 (మీడియా టుడే )**



టేక్మాల్ మండల పరిధిలోని తలుపులూరు గ్రామంలో శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భం గాఆలయంలో ప్రత్యేక పూజలు అర్చన అభిషేకాలను నిర్వహిం చారు. ఆలయ ఆవరణంలో నిర్వహించిన శివపార్వతుల కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేశారు కల్యాణోత్సవం అనంతరం గ్రామంలో విగ్రహాలను ఊరేగింపు చేశారు. ఊరేగింపు సందర్భంగా స్వాములు చేసిన విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. పూజా కార్యక్రమాలకు విచ్చేసిన భక్త జనానికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.భజన గీతాలతో శివాలయం మారుమరోగింది. ఇందులో గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు ఖర్జూర పండ్ల పంపిణీ

**మీడియా టుడే కల్వకుర్తి**

**నియోజకవర్గ ప్రతినిధి మార్చి 05**



ఐక్యత ఫౌండేషన్ ఛైర్మన్,కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,టాస్క్-సి ఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి సహకారంతోదాదాపు 3,600 కు పైగా ముస్లిం మైనారిటీ కుటుంబాలకు ఖర్జూర పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిమాట్లాడుతూ..శాంతి, ప్రేమ, ఐక్యతకు ప్రతీకగా నిలిచే పవిత్ర రంజాన్ మాసంలి ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక స్ఫూర్తిని కలిగిస్తుందని అన్నారు,ఈ పవిత్ర మాసంలో ముస్లిం సోదరులు ఆచరించే ఉపవాస దీక్షలు ఆత్మశుద్ధికి,ఆధ్యాత్మిక సాధనకు నిదర్శనమని తెలిపారు.ప్రతి రోజు ఉపవాసాలు ఆచరిస్తూ మనసును పవిత్రంగా ఉంచుకోవడం, ప్రేమ,కరుణ,దానం వంటి గొప్ప విలువలను ఆచరణలో పెట్టడం రంజాన్ మాసం గొప్పతనమని,ఈ పవిత్ర సమయంలో తనవంతు చిరు కానుకగా ముస్లిం మైనారిటీ సోదరులకు ఖర్జూర పండ్లను పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు,మైనారిటీ సోదరుల సంక్షేమం కోసం ఎల్లప్పుడూ తనవంతు తోడ్పాటును అందిస్తానని తెలుపుతూ,పవిత్ర రంజాన్ మాసం ప్రతి ఇంట్లో ఆనందం, శాంతి, ఐశ్వర్యం నింపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాలలోస్థానిక ముస్లిం మైనార్టీ నాయకులతో పాటు ఆయా మండలాల ఐక్యత ఫౌండేషన్ సభ్యులు రచ్చ శ్రీరాములు ,రఘు,లింగం,గణేష్ ,యాదయ్య,విజయ్,శ్రీపతి,శేఖర్,నాగిళ్ళ శివ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో నిందుతులకు 20 ఏండ్ల జైలు శిక్ష, 2 లక్షల జరిమానా

**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : గంజాయి కేసులో ముగ్గురు నిందుతులకు ఒక్కొక్కరికి 20 ఏండ్ల జైలు శిక్ష.....2లక్షల జరిమానా విధిస్తూ.. మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె. ఉమాదేవి తీర్పు నిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం... 2021 ఏడాది ఏప్రిల్ 7 న రఘునాథపాలెం పోలీసులు ఆధ్వర్యంలో వెంకటాపాలెం గ్రామ శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానస్పదంగా కనిపించిన కారు ను తనిఖీ చేయగా 30లక్షల విలువ గల 194 కేజీల గంజాయిని గుర్తించారు. నిందుతులకు అదుపులో తీసుకునే విచారించగా అక్రమార్జన కోసం డొంకరాయ నుండి హైదరాబాద్ గంజాయి సరఫరా చేస్తునట్లు విచారణ వెల్లడైంది. నిందుతులు ఎ 1 బోడ వాల 26 సం,, అననేయులుతండా, దండేగా (వి), పెద్దగూడూరు, మహబూబాద్ జిల్లా ఎ 2 కొండపల్లి రవితేజ 25 సం,, సారపాక బూర్గంపాడు మండలం ఎ 3 బొజ్జ వంశీ 22 సం, బూర్గంపాడు మండలం, సారపక చెందిన నిందుతులపై రఘునాథపాలెం పోలీస్ స్టేషన్ లో ఎండిపిఎస్, 1985 చట్టం కింద కేసు నమోదు చేసిన పోలీసులు సమగ్ర దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖలు చేశారు. నిందితుడిపై మోపిన అభియోగం రుజువు కావటంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.ప్రాసిక్యూషన్ కు సహకరించిన అప్పటి విచారణ అధికారలు ఇన్స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి , అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ,జె. శరత్ కుమార్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ సాంబశివరావు, కోర్టు లైజనింగ్ కె.శ్రీకాంత్ ఎస్ ఐ హోంగార్డ్ ఆఫీసర్ ఎండీ.ఆయూబ్ ను పోలీసు అధికారులు అభినందించారు.

## మునగాల మండలం ఆకుపాములలోని జడ్పీహెచ్ పాఠశాలను, అంగన్వాడి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**ఏడు ఎనిమిది తొమ్మిది మరియు పది తరగతి చదువుతున్న విద్యార్థిని , విద్యార్థులకు నోట్ బుక్స్,పెన్నులు పంపిణీ చేసిన జిల్లా కలెక్టర్**



**కోదాడ, మార్చి 05 (మీడియా టుడే)–:**
ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే విధంగా ఉపాధ్యాయులు సృజనాత్మకంగా బోధించాలని జిల్లా కలెక్టర్సూచించారు. గురువారం మునగాల మండలం ఆకుపాముల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు అంగన్వాడి కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థుల హాజరు వివరాలు తెలుసుకొని, ముఖ గుర్తింపు విధానంలో హాజరు నమోదు ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఆరు, ఏడు, ఎనిమిది, తొమ్మిది మరియు పదో తరగతుల గదులను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన విధానంపై అభిప్రాయాలు అడిగారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అన్ని తరగతులను పరిశీలించిన కలెక్టర్, ఏడు, ఎనిమిది,తొమిది తరగతి, పదవ తరగతి విద్యార్థులతో అన్ని సబ్జెక్టులలో మాట్లాడించి వారి పఠన నైపుణ్యాలను పరీక్షించారు. పాఠశాల ప్రాంగణ పరిశుభ్రత, తాగునీటి సదుపాయాలు, పరిశీలించారు. కుర్చీలు, బెంచెస్ కొరకు ప్రతిపాదనలు సమర్పించాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశిం చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని సబ్జెక్టు లలో పట్టు సాధించేందుకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఉపాధ్యాయులకు సూచిం చారు. పదాల సరైన ఉచ్చారణ, అర్థ వివరణతో పాటు ఆంగ్ల పదాలను తెలుగులో సరిగ్గా అనువదించి బోధించాలని తెలిపారు. విద్యార్థులు చదివింది అర్థం చేసుకోవడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నార.

# ఇందిరా మహిళా శక్తి పథకానికి మరొక బలమైన అడుగు

**కోదాడలో 'శ్రీనిధి శారీస్ అండ్ మ్యాచింగ్ సెంటర్' ప్రారంభం**

**మహిళల స్వయం ఉపాధికి ప్రోత్సాహం**



**కోదాడ, మార్చి 05 (మీడియా టుడే)–:**
మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం చేపట్టిన ఇందిరా మహిళా శక్తి పథకం కింద కోదాడ పట్టణంలో మరో స్వయం ఉపాధి కేంద్రం ప్రారంభించారు. కోదాడ పట్టణంలోని పాత పోస్ట్ ఆఫీస్ బజార్లో శ్రీనిధి శారీస్ అండ్ మ్యాచింగ్ సెంటర్ ను కోదాడ మున్సిపల్ చైర్పర్సన్ ఎర్నేని కుసుమ బాబు, వైస్ చైర్పర్సన్ దేవరపల్లి మల్లేశ్వరి, మున్సిపల్ కమిషనర్ ఏ. రమాదేవి లు గురువారం ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా బలపడే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని తెలిపారు. ముఖ్యంగా ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా సంఘాలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వారి జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నామని పేర్కొన్నారు.పట్టణంలో ప్రారంభమైన శ్రీనిధి శారీస్ అండ్ మ్యాచింగ్ సెంటర్ మహిళలకు ఉపాధి కల్పించడంతో పాటు స్థానిక ప్రజలకు నాణ్యమైన వస్త్రాలను అందుబాటులోకి తీసుకురానుందని తెలిపారు. మహిళలు వ్యాపార రంగంలో ముందుకు రావాలని, స్వయం ఉపాధి ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరు చుకోవాలని నాయకులు సూచించారు.ఇలాంటి వ్యాపారాల ద్వారా మహిళలు స్వయం సమృద్ధిని సాధించడంతో పాటు సమాజంలో తమ స్థానం మరింత బలపరుచుకుంటారని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మూడో వాడు కౌన్సిలర్ వంగూరీ గోపి, నాలుగో వార్డ్ కౌన్సిలర్ సుల్తానీ సుజాత రాంబాబు, మెప్మా సీఓ వెంకన్న, సి ఎల్ ఆర్ పి రాణి, నిర్వాహరాలు బచ్చలకూర అనూష ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## గ్రామంలో తాగునీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటా సర్పంచ్ స్నేహ దుర్గయ్య



**కోదాడ, మర్చి 05(మీడియా టుడే)–:**
వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గ్రామ ప్రజలకు త్రాగునీరు, నిత్య అవసరాలకు అవసరమైన నీరుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సంబంధిత అధికారులు నిత్యం అందుబాటులో ఉండేలా చర్యలు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ బల్లూరి స్నేహ దుర్గయ్య అన్నారు. మండల పరిధిలోని గణపవరం గ్రామంలో రానున్న యాసవ కాలాన్ని దృష్టిలో పెట్టుకొని తాగునీటి సమస్య రాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో గ్రామీణ జల సరఫరా శాఖ (ఆర్డబ్ల్యూఎస్) అధికారులు ఈఈ శ్రీనివాసరావు, డిఈ దేవాబిక్షం, ఏఈ రవి నాయక్ లను గ్రామానికి ఆహ్వానించడం జరిగింది.ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న తాగునీటి పరిస్థితులను వారికి వివరించి, బోర్ బావులు,చేతి పంపులను అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. అలాగే అవసరమైన ప్రాంతాల్లో కొత్త బోర్లు, చేతి పంపులు ఏర్పాటు చేయుటకు ఎస్టిమేట్లు ఇవ్వాలని అధికారులను అభ్యర్థించడం జరిగింది. గ్రామ ప్రజలకు వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు రాకుండా ఉండేందుకు అధికారులకు వివరించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శంకరశెట్టి కోటేశ్వరరావు, కాసాని సత్యం, నల్లాని చెన్నయ్య, రామారావు, హీరం, నాగ స్వరూప్, కృష్ణయ్య, రవి, తోకల గోపి, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణ ప్రతి ఒక్కరికి బాధ్యత

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి తేళ్ల విజయ్ మీడియా టుడే,మార్చి 5, 2026:**
పారిశుద్ధ్య నిర్వహణ ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ ప్రాంతంలో గల 32వ డివిజన్ లో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, మేయర్ ధర్ని మధుకర్ డిప్యూటీ మేయర్ చల్లా రమ్య లతో కలిసి మంచిర్యాల శుభ్రత – ప్రతి ఒక్కరి ఆరోగ్య భద్రత కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పారిశుద్ధ్యం ప్రతి ఒక్కరి బాధ్యత అని, పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి నిధులు మంజూరు చేయడం జరిగిందని, వచ్చే 99 రోజులలో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసే విధంగా కార్యచరణ రూపొందించడం జరిగిందని తెలిపారు. మున్సిపాలిటీలు, గ్రామపంచాయతీలలో మాత్రమే కాకుండా అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని, పారిశు ద్ధ్య మాత్రమే కాకుండా ఆ ఏ కార్యాలయాలలో పెండింగ్ లో ఉన్న జనన, మరణ, భవన నిర్మాణ, ఇతర ధ్రువపత్రాలకు సంబంధించి ఫైళ్ళ క్లియరెన్స్ కొరకు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. అధికారులు, సిబ్బంది ప్రజాప్రతినిధులను, ప్రజలను భాగస్వామ్యం చేసుకుంటూ పనులను పూర్తి చేయాలని తెలిపారు. పారిశుధ్య సిబ్బంది ప్రతిరోజూ ప్రతి ఇంటింటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించాలని, ఉపయోగకరమైన చెత్తను వేరు చేసి సెగ్రిగేషన్ షెడ్ కు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గృహాలు, పరిశ్రమలు, మార్కెట్ ప్రాంతాలలో చెత్తను రోడ్డుపై, మురుగు కాలువలలో వేసినట్లయితే చర్యలు తీసుకోవడం జరుగుతుందని, రోడ్లు, మురుగు కాలువలు శుభ్రం చేయడం, వీధి దీపాల మరమ్మత్తులు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా శు భ్రత కార్యక్రమంలో పాల్గొన్నట్లయితే కార్యక్రమం విజయవంతం అవుతుందని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో శుభ్రత కార్యక్రమాన్ని విజయవంతం చేసి అందరికీ ఆదర్శంగా నిలవాలని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మాట్లాడుతూ శుభ్రత కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 60 డివిజన్ లలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టడం జరుగుతుందని, మున్సిపల్, విద్యుత్, త్రాగునీరు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ముందు రోజు డివిజన్లో పర్యటించి నెలకొన్న సమస్యలను గుర్తించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మంచిర్యాల పట్టణంలోని ఫంక్షన్ హాల్ లు, హాస్పిటల్ లు, వ్యాపార సముదాయాలు, మద్యం దుకాణాల నిర్వాహకులు శుభ్రత విషయంలో నిబంధనలు పాటించాలని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని తెలిపారు. నస్పూర్ మండలం తీగల్ పహాడ్ పరిధిలోని మండల పరిషత్ ప్రాథమిక ఉన్నత పాఠశాల భవన నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం నస్పూర్ మండల కేంద్రంలో గల ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల గోదామును జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్ రావు, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరావు దేశ్ పాండే, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి త్రైమాసిక పరిశీలనలో భాగంగా సందర్శించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి తేళ్ల విజయ్ మీడియా టుడే,మార్చి 5, 2026:**
అభివృద్ధిలో భాగంగా చేపట్టిన నిర్మాణ పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని చెన్నూర్ మండలంలో చేపట్టిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్య రంగాన్ని బలోపేతం చేస్తూ అనేక కార్యక్రమాలు చేపడుతుందని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సకల సదుపాయాలు కల్పించి నాణ్యమైన విద్య అందించే దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో భాగంగా చేపట్టిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మాణ పనులను త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. మండలంలోని సోమనపల్లి గ్రామంలో ప్రభుత్వం 200 కోట్ల రూపాయల వ్యయంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల స్థలాన్ని చెన్నూరు మండల తహసిల్దార్ మల్లికార్జున్ తో కలిసి సందర్శించారు. పాఠశాలకు నిర్మాణానికి సంబంధించి పనులను త్వరగా ప్రారంభించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. చెన్నూర్ పట్టణంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులను సందర్శించి పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. స్థానిక ప్రజలకు వేగవంతమైన, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆసుపత్రి నిర్మాణాన్ని చేపట్టి పనులు కొనసాగిస్తుందని, ఈ క్రమంలో గుత్తేదారుల సమన్వయంతో పనులు త్వరగా పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి ప్రహరీ గోడ, పెండింగ్ పనులను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులలో పరిశీలించి త్వరగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా మెనూ ప్రకారం సకాలంలో పౌష్టిక ఆహారం అందించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. 9వ తరగతి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి వారి అభ్యాసన సామర్థ్యాలను పరిశీలించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అనంతరం కోటపల్లి మండల కేంద్రంలో గల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో కొనసాగుతున్న ఆదనపు తరగతి గదులు, భోజనశాల, వంటశాలల నిర్మాణ పనులు, మధ్యాహ్నం భోజన పథకం అమలును మండల తహసిల్దార్ రాఘవేంద్ర, మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేశ్వర్ రెడ్డి లతో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థినులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, తరగతిగదులు, భోజనశాలను పరిశీలించారు. మండల తహసిల్దార్ పరిధిలో భూభారతి దరఖాస్తులను పెండింగ్ లేకుండా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రతిరోజు తమ పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలపై మండల పంచాయతీ అధికారి, ఆయా గ్రామాల సర్పంచ్ లు, ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులను సమన్వయం చేసుకుంటూ నిరంతరం పర్యవేక్షించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అసోంలో డోనర్ ప్రాజెక్టుల పురోగతి భేష్

## డబుల్ ఇంజన్ సర్కార్ తో తీవ్రవాద ప్రాబల్యం పూర్తిగా తగ్గిపోయింది!

### -కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే , మార్చి 05 :**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ గత ఐదేళ్లలో 10 వేల మంది ఉల్ఫా తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిశారు.అభివృద్ధి, మౌలిక సదుపాయాల్లోనూ పురోగతినరేంద్రమోదీ ప్రభుత్వ ప్రోత్సాహంవల్లే ఇదంతా సాధ్యమైందన్న అసోం అధికారులు.క్రైం రేట్ తగ్గడంతోపాటు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగిందని వెల్లడిగౌహతిలోని కామాఖ్య అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మంత్రి బండి సంజయ్.నేడు అసోంలోని దిమాహోసావో జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పర్యటించనున్న బండి సంజయ్.అస్సోం రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, ప్రాయోజిత సంక్షేమ కార్యక్రమాల అమలు తీరు వేగవంతంగా కొనసాగుతోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అభినందించారు. కేంద్ర ప్రభుత్వ సహాయ సహకారాలతో గత ఐదేళ్లలో అస్సోంలో తీవ్రవాద ప్రాబల్యం పూర్తిగా తగ్గిందని, దాదాపు 10 వేల మంది ఉల్ఫా తీవ్రవాదులు జనజీవన స్రవంతిలో కలిసిపోయారని చెప్పారు. లొంగిపోయిన వారికి అందిస్తున్న సహాయ పునరావాస కారక్రమాలపై పోలీసులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు, పెట్టుబడుల వివరాలపైనా కేంద్ర మంత్రి ఆరా తీశారు. గత ఐదేళ్లలో ఒక్క చిన్న ఫిర్యాదు కూడా లేకుండా ఏకంగా 1 లక్షా 51 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసినట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అజయ్ తివారీ వెల్లడించారు. పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని, ఇప్పటి వరకు దాదాపు రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులకు ఒప్పందం జరిగిందన్నారు. ఒక్క సెమీ కండక్టర్ పరిశ్రమ ఏర్పాటుతోనే 27 వేల ప్రత్యక్ష ఉద్యోగాలు వచ్చాయన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏటా వృద్ధి రేటు పెరుగుతోందని, అదే సమయంలో క్రైం రేటు తగ్గుతోందని, కేంద్రం నూతనంగా అమలు చేస్తున్న క్రిమినల్ చట్టాల అమలులతోనూ ముందంజలో ఉన్నట్లు వివరించారు. మైనింగ్ రంగంలో చేపట్టిన సంస్కరణలతో దేశంలో అసోం నెంబర్ వన్ గా నిలిచిందన్నారు. గతంతో పోలిస్తే ప్రభుత్వ సిబ్బంది పనితీరులోనూ ఎంతో మార్పు వచ్చిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సహాయ సహకారాలవల్లే అస్సోం రాష్ట్రంలోని ప్రజల జీవన ప్రమాణాల్లో గణనీయమైన పురోగతి కన్పిస్తోందన్నారు. ఈశాన్య రాష్ట్రాల పర్యటనలో ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి మంత్రి బండి సంజయ్ కుమార్ ఈరోజు అస్సాం రాష్ట్ర రాజధానిలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై రాష్ట్ర అతిథి గృహంలో సమీక్ష నిర్వహించారు రాష్ట్రంలోని దిమా హసావో జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత కార్యక్రమాల పనితీరుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. తొలుత అసోంలో కేంద్ర నిధులతో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై రెండు గంటలకుపైగా సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి అజయ్ తివారీ, డీజీపీ హర్మీత్ సింగ్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్షకు హాజరయ్యారు. ఈ సందార్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్ లో 10 శాతం నిధులను ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కేటాయించడంతోపాటు ఆయా అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తుండటంతో ఈశాన్య రాష్ట్రాల్లోని ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మెరుగయ్యాయని తెలిపారు. ముఖ్యంగా హోం, ఆరోగ్యం, వ్యవసాయం, రోడ్లు మరియు తాగునీటి రంగాల్లో అస్సాం రాష్ట్రం గణనీయమైన పురోగతి సాధించిందని తెలిపారు. విద్య, పోషణ అభియాన్ నిధులు, వృత్తి విద్యలో అసెస్మెంట్ అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు.మరోవైపు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ గురువారం గౌహతిలోని ప్రసిద్ధ శక్తి పీఠమైన కామాఖ్య దేవి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు కేంద్ర మంత్రికి ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలోని కామాఖ్య అమ్మవారిని దర్శించుకుని ఆలయ పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. కాగా బండి సంజయ్ శుక్రవారం గౌహతి నుండి హెలికాప్టర్ ద్వారా బయలుదేరి దిమా హసావో జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పర్యటించి కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల అమలు తీరు తెన్నులను ప్రత్యక్షంగా పరిశీలించనున్నారు.

# నిషేధిత పత్తి సాగు వలన కలుగు అనర్థాలపై రైతులకు అవగాహన

## వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ )ఆధ్వర్యంలో కార్యక్రమం



**మందమర్రి / మీడియా టుడే, మార్చ్ 5 2026:**
మందమర్రి మండలం సన్రోన్ పల్లి వద్ద గల రైతు వేదికలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో చెన్నూరు డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు బానోతు ప్రసాద్ నిషేధిత పత్తి అయిన గడ్డి మందుని తట్టుకొని పెరిగే పత్తి సాగువలన కలుగు అనర్థాలపై అవగాహన కల్పించారు. సి పి 4-ఈ పి ఎస్ పి ఎస్ అను జీన్ ను విత్తనంలో చెప్పించి తయారుచేసిన విత్తనాన్ని హెర్బిసైడ్ టాలరెంట్ పత్తిగా పేర్కొంటామని,ఇట్టి పత్తిపై గ్లైపోసిట్ అను గడ్డి మందు పిచికారి చేసిన పత్తి పై ఎటువంటి ప్రభావం లేకుండా కేవలము గడ్డి జాతులు మాత్రమే అంతరిస్తాయని, అట్టి పత్తిని రైతులు వివిధ మార్గాల ద్వారా పొంది సాగుచేస్తున్నారని, ఈ రకమైన పత్తి సాగు వలన భూమి కాలుష్యంతో పాటు భూగర్భ జలాల కాలుష్యం జరిగి భూములు నిర్జీవంగా మారుతాయని, అదేవిధంగా కలుపు నివారణకు గ్లైపోసెట్ అను గడ్డి మందును విరివిగా వినియోగించడం ద్వారా పత్తి మొక్కలు కలుషితము కావడమే కాకుండా అట్టి పత్తిని వినియోగించి నేసిన గుడ్డలు వినియోగించిన మనుషులకు చర్మ సంబంధ క్యాన్సర్లు, పత్తి నుండి వేరు చేసిన గింజల నుండి తీసిన నూనె వినియోగించడం ద్వారా మానవాళికి వివిధ రకాల జన్యు సంబంధ వ్యాధులు సంక్రమిస్తాయని, నూనె తీసిన తర్వాత మిగిలిన పిప్పిని పశువులకు దానా గా వాడుట ద్వారా పాలలో కూడా క్యాన్సర్ కారక అవశేషాలు ఉంటున్నట్లు గుర్తించడం జరిగిందని అందుకే మనదేశంలో ఇట్టి పత్తిని నిషేధించడం జరిగిందని కావున రైతు సోదరులు ఎవరైనా ఇటువంటి విత్తనాలను అమ్మ చూపినట్లయితే వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని లైసెన్స్ కలిగిన డీలరు వద్ద నుండి మాత్రమే అనుమతి ఉన్న విత్తనాలను కొనుగోలు చేయాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్ మై, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, కృషి సఖీలు రజిత, వసంత మరియు రైతులు కమల మనోహర్ రావు, రాయమల్లు, నారాయణరావు, విత్తన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఈ నెల 8 న 39వ నెల నెలా ఉచిత వైద్య శిబిరం

**100 రూపాయలకే బీపీ షుగర్ మందులు పంపిణీ**

**వైద్య శిబిరాన్ని సద్వినియోగం సదివినియోగం చేసుకోండి**

**నూతక్కి గంగాధర్ రావు ఫౌండేషన్ చైర్మన్ ఏటుకూరి రామారావు పిలుపు**



**నేలకొండపల్లి మార్చి5 మీడియా టుడే**
నేలకొండపల్లి సిపిఐ(ఎం) సీనియర్ నాయకులు అమరజీవి నూతక్కి గంగాధర్ రావు (ఎన్.జి.ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన (ఆదివారం) స్థానిక సిపిఐ(ఎం) కార్యాలయం రావెళ్ల సత్యనారాయణ భవనంలో జరిగే 39 వ నెల నెలా ఉచిత వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎన్జీఆర్ ఫౌండేషన్ కన్వీనర్ ఏటుకూరి రామారావు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక రావెళ్ల సత్యనారాయణ భవనంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ వైద్య శిబిరంలో బీపీ, షుగర్, గ్యాస్ట్రిక్ సమస్యలతో పాటు ఇతర సాధారణ జబ్బులకు కూడా ఉచితంగా వైద్య సేవలు అందించడం జరుగుతుందన్నారు. వైద్య శిబిరంలో డాక్టర్ డాక్టర్ రావెళ్ల రంజిత్ ఎంబిబిఎస్, ఎండి (జనరల్ ఫిజీషియన్), డాక్టర్ రాజేష్ ఎంబిబిఎస్, డిఎన్బి, (ఈఎన్టి) చెవి ముక్కు గొంతు వైద్య నిపుణులు, డాక్టర్ అడపా జయశ్రీ ఎంబిబిఎస్, ఎంఎస్, ఆప్తాలజీ (నేత్ర వైద్య నిపుణుల రోగులకు వైద్య సేవలు అందిస్తారన్నారు. షుగర్ పరీక్షలు రెండు రోజులు ముందుగా చేయించుకుని రావాలన్నారు. బీపీ షుగర్, గ్యాస్ట్రిక్ రోగులకు వంద రూపాయలకే ఉచితంగా మందులను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. డాక్టర్ జయశ్రీ కంటి హాస్పిటల్ వారిచే ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదయం 6 గంటల నుండి 11 గంటల వరకు మాత్రమే వైద్య శిబిరం జరుగుతుందని ప్రజలు సకాలంలో హాజరై వైద్య సేవలు పొందాలని సూచించారు. పేదలకు వైద్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకురావాలనే సేవా దృక్పథంతో నెలనెలా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మరింత సమాచారం కొరకు 9490098225, 9030897480, 9949592544, 9110364581 లను సంప్రదిం చాలన్నారు. ఈ సమావేశంలో ఎన్జీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి కె.వి రామిరెడ్డి, కోశాధికారి గుడవర్తి నాగేశ్వరరావు, కట్టెకోల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

# సీతమ్మ జీవితం నేటి తరానికి ప్రేరణ కావాలి

## సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంత రావు



**నేలకొండపల్లి మార్చ్ 5 మీడియా టుడే**
కనకబండి సీతమ్మ సహనం, సేవా భావం నేటి తరంప్రజలకు ప్రేరణ కావాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. నేలకొండపల్లి మండలం లోనిభైరవునిపల్లి గ్రామానికి చెందిన కనకబండిసీతమ్మసంస్మరణ సభసిపిఐ మండల కార్యదర్శి మారిశెట్టి వేంకటేశ్వరరావు ,గ్రామ శాఖ కార్యదర్శి బాలిన కృష్ణంరాజు అధ్యక్షతన గురువారం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రామాయణం లో సీతమ్మ కు ఎంతో ఓపికో మనం చదువుకున్నాం ఈ కనకబండి సీతమ్మ ను 35 సంవత్సరాలుగా మేముచూశామని పేర్కొన్నారు.సితయ్య జిల్లా నాయకుడు గా సర్పంచ్ గా ప్రజలలో నిలవడానికి కారణం సీతమ్మ అని చెప్పారు.గ్రామంలో సిపిఐ నీ మేజర్ పార్టీ గా నీలపటం లో సీతమ్మ సలహా, సూచనలు ప్రాముఖ్యమైనవని తెలియజేశారు.సీతమ్మ సేవలను గుర్తు చేసుకుంటూ, ఆమె ఆశయాలను నెరవేర్చాలని పిలుపునిచ్చారు సీతమ్మ జీవితం నేటి తరానికి ప్రేరణ కావాలని కొనియాడారు.ఆమె సేవలు ఎప్పటికీ మర్చిపోలేని తెలిపారు.సీతమ్మ కుటుంబ సభ్యులకు సిపిఐ పార్టీ తరుపున సంతాపం తెలియజేస్తూ, ఆమె ఆశయాలను నెరవేర్చడానికి పార్టీ సిద్ధంగా ఉంటుంది వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కర్నాటి భాను ప్రసాద్, సిద్ధినేని కర్ణ కుమార్, ఐజేయు జిల్లా ఉపాధ్యక్షులు పొలంపల్లి నాగేశ్వరరావు,సిపిఐ మండల సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్, మండల కార్యవర్గ సభ్యులు కర్నాటి నళిని రాణి, పాల్తియ శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ గుండపనేని లక్ష్మణరావు, ఉప సర్పంచ్ ఆలేటీ ఉమామహేష్ గ్రామ శాఖ సభ్యులు వివిధ పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా అమలు చేయాలి

## జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి తేళ్ల విజయ్ /మీడియా టుడే,మార్చి 5, 2026:**
ప్రజా పాలన- ప్రగతి ప్రణాళిక పకడ్బందీగా రూపొందించి పక్కాగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య తో కలిసి వివిధ శాఖల జిల్లా అధికారులతో 99 రోజుల ప్రణాళిక రూపకల్పనపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంగన్వాడి సెంటర్లలో పోషణ ప్రణాళిక అమలు, డ్రాప్ అవుట్ పిల్లలను తిరిగి తీసుకురావడం, సామ్, మామ్ పిల్లల గుర్తింపు, సఖి సంబంధిత అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా వెనుకబడిన తరగతుల, షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్ తెగల, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు వారి ఆధ్వర్యంలోని సంక్షేమ వసతి గృహాలలో పారిశుద్ధ్యం, ఉపకార వేతనాలు, డైట్ చార్జీల పెంపుపై అవగాహన కల్పించడం, పిల్లల హాజరు శాతం పెంచడం, ఆయా శాఖల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పథకాలపై అవగాహన కల్పించడం, లబ్ధిదారులను గుర్తించడం అంశాలపై కార్యచరణ రూపొందించాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో నూతన సబ్ స్టేషన్ ల ఏర్పాటు, గృహ జ్యోతి పథకం అమలు, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రోగ్రెసివ్ ఫార్మర్స్ గుర్తింపు, సందర్శన, భూసార ఆరోగ్య కార్డు, పంట మార్పిడి, సోలార్ పంపుల ఏర్పాటు, రైతులతో శాస్త్రవేత్తల సమావేశం, పప్పుధాన్యాల పంటలను ప్రోత్సహించడం వంటి అంశాలపై ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శిశు మరణాల నియంత్రణ, ఆసుపత్రులలో ప్రసవాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆరోగ్య ఉప కేంద్రాలు, బస్తీ దవాఖానలు, పాఠశాలల సందర్శన, ప్రభుత్వ వైద్యశాలలు, నాణ్యత ప్రమాణాలు పెంపొందించడం, ప్రపంచ ఆరోగ్య దినోత్సవం, డ్రగ్ కంట్రోల్ రెగ్యులేటరీ, డిజిటల్ హెల్త్ కార్డ్స్ జారీ చేయడం, హెచ్ పి వి వ్యాక్సినేషన్ తదితర అంశాలపై పకడ్బందీగా కార్యచరణ రూపొందించాలని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం, జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయం ఆధ్వర్యంలో పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీరు, పన్నుల వసూలు, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, పల్లె ప్రకృతి వనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, సెగ్రిగేషన్ షెడ్ల నిర్వహణ వంటి అంశాలు, గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కూలీల నిర్వహణ, మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం, మూత్రశాలలు, కిచెన్ షెడ్ల నిర్మాణం, ప్లాంటేషన్ ప్రోగ్రాం, సామాజిక ఇంకుడు గుంతల నిర్వహణ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో పేరెంట్ టీచర్ సమన్వయ సమావేశం, అసంపూర్తిగా ఉన్న నిర్మాణాల పురోగతి, మండల స్థాయిలో సౌకర్యాల కల్పన తదితర అంశాలపై కార్యచరణ రూపొందించాలని తెలిపారు. గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల పనులు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించాలని, రవాణా శాఖ ఆధ్వర్యంలో కంటిచూపు పరీక్షలు నిర్వహణ, ఎక్కువ సంఖ్యలో వాహనాలు ఆగే ప్రదేశాలలో డ్రైవర్లకు అవగాహన కల్పించడం, డ్రంక్ అండ్ డ్రైవ్ పై కఠినంగా వ్యవహరించడం, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడం, జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేయబడిన నూతన రేషన్ కార్డులు, సన్న బియ్యం పంపిణీ వివరాలు, గ్రామపంచాయతీ, మున్సిపల్ వార్డుల వారిగా వివారాలతో సిద్ధం చేయాలని తెలిపారు. జిల్లా అధికారులు తమ పరిధిలోని కార్యాలయంలో, కార్యాలయాల పరిసరాలలో పారిశుద్ధ్యం నిర్వహణ, పెండింగ్ లో ఉన్న ఫైల్స్ క్లియర్ చేయడం వంటి వాటిని పూర్తి చేయాలని, అంతర్గత సమావేశాలు నిర్వహించి 99 రోజుల ప్రణాళిక తయారు చేసి, పక్కాగా అమలు అయ్యేలా సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మారని యాజమాన్యం తీరు

**మరలా రోడ్డు ఎక్కిన లారీ ఓనర్స్ - మహా సిమెంట్స్ వారి హామీలు మూడు నాల్ల ముచ్చటే**

**స్థానిక లారీ ఓనర్లకు ఇచ్చిన హామీలు నోటిమాటలే**



**( హుజూర్ నగర్ )// మేళ్లచెరువు : మీడియా టుడే మార్చి 05:**
సూర్యాపేట జిల్లా మేళ్లచెరువు లోని మహా సిమెంట్( మై హోమ్) ఫ్యాక్టరీ ముందు మేళ్ళచెరువుకు చెందిన స్థానిక లారీ డ్రైవర్లు మూడు రోజుల క్రిందట తన సమస్యల గురించి ధర్నా చేయగా యాజమాన్యం వారు దిగివచ్చి వారి ధర్నా ని విరమింప చేసి మీకు తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కానీ వారి హామీ మూడు నాళ్ళ ముచ్చటగానే మిగిలిపోయింది. మరలా పాతపాటే అన్నట్టుగా స్థానిక లారీ ఓనర్లకు డివోలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని డ్రైవర్లు మరల ధర్నా కి దిగారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా ధర్నాకి కూర్చున్నారు.యజమానుల పద్ధతికి డ్రైవర్లు అవాక్కవుతున్నారు. సమస్యల పట్ల పోరాటం చేస్తున్న మమ్మ లను తగిన న్యాయం చేస్తామని చెప్పి మా ధర్నాను విరమింప చేసి మరల మమ్మలను వివక్షకు గురి చేయడం తగదని డ్రైవర్లు అంటున్నారు. ఈసారి యాజమాన్యం వారి మోసపూరిత హామీలను నమ్మం అని అంటున్నారు . ప్రతిసారి మేము దగాపడవలసిందేనా? మాకు నోటి మాటల ద్వారా కాదు పేపర్ పై రాతపూర్వకమైన హామీలు కావాలి అని డ్రైవర్లు అంటున్నారు. కానీ సంస్థకు సంబంధించిన అధికారులు మాత్రం సంస్థతో పెట్టుకోవద్దు దెబ్బ తింటారు సంస్థ కింద మీరెంత? అని వేలెత్తి చూపిస్తూ బెదిరిస్తున్నారు. తర్వాత ఏమి జరిగినా మాకు సంబంధం లేదు అంటున్నారు. ఆ మాటల్లోని ఆంతర్యం అంతరార్థం ఏమిటో? డ్రైవర్లు మాత్రం మరల ఇలాంటి పరిస్థితి పునరావృతం అయితే ఈసారి ఉపేక్షించేది లేదు అంటూ ధర్నాని విరమించుకున్నారు.

# శాతవాహన ఆర్ట్స్ కళాశాలలో మహిళల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం

**మహిళలు ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలి- ఆచార్య ఉమేశ్**

**సమతుల్యమైన జీవనశైలి అవసరం- డా. నయని**







**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ : మీడియా టుడే, మార్చి 05 :**
ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో బాలికల కోసం ఆరోగ్య అవగాహన కార్యక్రమం, మహిళా సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు.వివో లైఫ్ సైన్సస్ ఢ సన్రైజ్ హాస్పిటల్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ నయని ఇంజమూరి మాట్లాడుతూ తమ ఆరోగ్యం మహిళలు అత్యంత జాగరుకతతో ఉండాలని ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని, హార్మోన్ సమతుల్యత లేకపో వడం వలన శరీరంలో జీవక్రియ సంబంధ సమస్యలను కలగ చేస్తుందని,దీనివలన జీవనశైలిలో మార్పులు వస్తాయని వీటితో మహిళలకు అనేక రకాల రుగ్మతలు వస్తాయని ఇలాంటి ఆరోగ్య ప్రమాదాలను అరికట్టు కోవడానికి తక్షణమే వైద్యులను సంప్రదించాలని చిన్న మార్పులతో జీవనశైలిని మార్చుకోవచ్చని సమతుల్యమైన ఆహారంతో ఇలాంటి ప్రమాదాలను జయించవచ్చని తెలిపారు.ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ ముఖ్య అతిథిగా విచ్చేసి మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, ఆరోగ్యమే మహాభాగ్యమని, విద్యార్థినుల ఆరోగ్యం కొరకు విశ్వవిద్యాలయం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తుందని నొక్కి చెప్పారు.కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య. పి సతీష్ కుమార్, ఓ ఎస్ డి టు విసి డాక్టర్ డి . హరికాంత్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పద్మావతి, మహిళా సెల్ డైరెక్టర్ డాక్టర్ వి.నమ్రత, వార్డెన్లు సావిత్రి, జయంతి, సంధ్య సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

# 99.రోజులు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో అన్ని వయస్సు వారికి ఆరోగ్య పరీక్షలు

**జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి. డాక్టర్,ఎం . రజిత**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే : మార్చి 05:**
గురువారం రోజు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.రజిత రాజన్న సిరిసిల్ల "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక" 99 రోజుల ఆరోగ్య కార్యక్రమంల భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు , జిల్లా పాలనాధికారి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. ఎస్ రజిత మాట్లాడుతూ అన్ని వయస్సుల వారికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళిక చేయడం జరిగిందని, అన్నారు నిర్దేశిత రోజులలో నాలుగు దశలలో నిర్వహించడం జరుగుతుంది. మొదటి దశలో మార్చి 6 నుండి మార్చి 31 వరకు గర్భిణీలకు వృద్ధులకు రక్తహీనత నిర్ధారణ పరీక్షలు తెలంగాణ డయాగ్నొస్టిక్స్ సెంటర్ ద్వారా ఆరోగ్య సేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యులు, ఆర్బిఎస్కే బృందాలు, ఇతర వైద్య సిబ్బందికి గర్భిణీ స్త్రీలకు , తల్లులకు అందవలసిన పోషకాహారము, వ్యాధినిరోధక టీకాల, అవగాహన కల్పించడంతోపాటు గర్భాశయ క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్లపై ఆరోగ్య పరీక్షలు ప్రత్యేక వైద్య నిపుణుల ప్రసూతి స్త్రీ రోగనిపుణులు, పిల్లల వైద్య నిపుణులు, నేత్ర, కీళ్ల ఎముకల, దంత వైద్య నిపుణులతో పాటు జనరల్ మెడిసిన్ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారని ఆరోగ్య మహిళా దినోత్సవం మార్చి 8 , సందర్భంగా గర్భాశయ క్యాన్సర్ రాకుండా స్త్రీలకు హెచ్పీవీ వ్యాక్సిన్ ఇవ్వడం జరుగుతుం దని, ప్రజలు ఈ ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా 2 రెండవ దశ: ఏప్రిల్ 1 నుంచి ఏప్రిల్ 15వ తేదీ వరకు 30ఏళ్ల పైబడిన వారందరికీ మధుమేహము, రక్తపోటు, క్యాన్సర్ సంబంధిత వ్యాధులు, చెవి ముక్కు గొంతు, నేత్ర వైద్య నిపుణులు, ఇతర వ్యాధుల చికిత్స అందించి మందులు ఇవ్వడం జరుగుతుందని,3 దశలో ఏప్రిల్ 16 నుంచి మే 15 వరకు సంక్రమణ వ్యాధులైన క్షయ వ్యాధి, ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు, వడదెబ్బ నివారణ రక్షణ కొరకు అవగాహన చికిత్స అందజేస్తారని. 4 నాలుగవ దశలో 16 మే నుంచి జూన్ 12 వరకు పట్టణ గ్రామీణ ప్రాంతాలలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఆహార భద్రతలపై పౌష్టికాహారము, చేతులు శుభ్రంగా కడుక్కోవడం అవగాహన మరియు ఆరోగ్య సేవలు అందిస్తామని తెలిపారు

# పంచాయతీ కార్మికులను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్**




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్: మీడియా టుడే , మార్చి 05:**
గ్రామపంచాయతీ యూనియన్ హుజురాబాద్ మండల కమిటీ సమావేశం, ఆకునూరి సుధాకర్ అధ్యక్షతన స్థానిక హుజురాబాద్ హమాలీ యూనియన్ కార్యాలయంలో నిర్వహించడం జరిగినది. ఈ యొక్క సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సిఐటి యు జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు గత మూడు నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం వేతనాలు చెల్లించడం లేదని, ఎన్నికలకు ముందు తన మేనిఫెస్టోలో పెట్టిన విధంగా పంచాయతీ కార్మికులకు కనీస వేతనం అమలు చేస్తామని ఉద్యోగ భద్రత కల్పిస్తామని, గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు నేరుగా కార్మికుల అకౌంట్లో వేస్తామని చెప్పి చెప్పిన మాటలు నేటికీ అమలు కాలేదని రెండు సంవత్సరాల కాలం పూర్తయినప్పటికీ, పంచాయతీ కార్మికులకు గతంలో ప్రభుత్వమే బడ్జెట్ కేటాయించి నేరుగా వేతనాలు చెల్లించిందని, ఇప్పుడు కార్మికుల వేతనాలు గ్రామపంచాయతీ పాలకవర్గాలే చెల్లించాలని రెండో తారీఖు నాడు పంచాయతీరాజ్ కమిషనర్ ఆఫీస్ నుండి సర్క్యులర్ జారీ చేయడం ఇది దుర్మార్గమైన చర్యని అన్నారు. గ్రామపంచాయతీలో ఉండేది అరకురానిధులే కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుండి పంచాయతీలకు నిధులు సక్రమంగా కేటాయించపోగా కేంద్రం ఇచ్చే నిధులనుండే, పంచాయతీలలో అభివృద్ధి పనులు వివిధ ఖర్చులు మరియు కార్మికుల వేతనాలు చెల్లించాలంటే పంచాయతీలకు బడ్జెట్ సరిపోదని, ఇప్పటికే అనేక పంచాయతీలలో గత సర్పంచులు కార్యదర్శులు వివిధ రకాల ఖర్చులకోసం నిధులు ఖర్చుపెట్టి ఉన్నారని అట్టి బకాయి నిధులు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించకపోగా 15 ఫైనాన్స్ నిధులను ఉండే చెల్లించాలని, అనడం కార్మికుల జీతాలు ఇవ్వకపోవడం బాధ్యతరాహిత్యం అన్నారు. దీనిపై దశలవారీగా కార్మికులను ఐక్యం చేసి ఆందోళన పోరాటాల నిర్వహిస్తామని తెలిపారు. ఇప్పటికే ఒక్కొక్క గ్రామపంచాయతీలో మూడు నెలల బకాయి జీతాలు ఉన్నాయని, ఆన్లైన్లో పేర్లు నమోదు లేని కార్మికులకు ఎనిమిది నెలలు 12 నెలలు కూడా వేతనాలు పెండింగ్ ఉన్నాయని ఇలాంటి సందర్భంలో స్థానిక పాలకుల వేతనాలు చెల్లించాలని నిర్ణయం సరైంది కాదని కార్మికులను బానిసత్వం లోకి నే ట్టే నిర్ణయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి బిక్షపతి,కమిటీ సభ్యులు, మాదుగుల ఉమా, ఎల్లయ్య, మంద లక్ష్మి, ఇమ్మడి రాజు, ఎడ్ల శ్రవణ్, అరవిందు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు




**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి మార్చ్ 05**
కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి.గురువారం మొదటి సంవత్సరం గణితం ,చరిత్ర, జంతుశాస్త్రం, పరీక్షలు నిర్వహించారు.ఏడు పరీక్షా కేంద్రాలలో 1482 మంది విద్యార్థుల గాను,1422 మంది పరీక్షలకు హాజరైనట్లు నిర్వాహకులు రామ్ రెడ్డి తెలిపారు.60 మంది విద్యార్థులు పరీక్షలకు గైర్హాజరైనట్లు పేర్కొన్నారు.

# నిరు పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా ఎమ్మెల్యే కసిరెడ్డి



**మీడియా టుడే కల్వకుర్తి నియోజకవర్గ ప్రతినిధి మార్చ్ 05**
నిరుపేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గురువారం కల్వకుర్తి నియోజకవర్గం లోని వివిధ మండలాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన సీఎం రిలీఫ్ పండు చెక్కులను పంపిణీ చేశారు.అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారు ఈ ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు

# వాణినికేతన్ హై స్కూల్ లో పదవ తరగతి విద్యార్థులు వీడ్కోలు




**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్. మీడియా టుడే : మార్చి 05**
: సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని వాణినికేతన్ హై స్కూల్లో పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు హంగామా కొనసాగింది. పాఠశాల ఆవరణలో గురువారం జరిగిన కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలు అంటే భయాన్ని విడిచి పెట్టాలన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు ఉత్తములుగా నిలుస్తారని పేర్కొన్నారు. 9వ తరగతి విద్యార్థులు పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు చెప్పడం మంచి సంప్రదాయమన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్షల ప్యాడ్లు, పెన్నులను పంపిణీ చేశారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనిధి, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రమేష్, రాజు, సంతోష్, తిరుపతి, రాజు, శోభ, సుమంగళి, రేఖ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, కళ్యాణి, షమీమా, రేణుక, జలజ, శాంత, పద్మ, మౌనిక, రేణుక, స్వాతి, సునీతల తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు

# క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం




**కరీంనగర్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్: మీడియా టుడే , మార్చి 05 :**
తెలంగాణ ప్రభుత్వ క్రీడా పాఠశాలల్లో (హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్) 2026-27 విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వి. శ్రీనివాస్ తెలిపారు.ముఖ్య సమాచారం:అర్హత: 01-09-2017 నుండి 31-08-2018 మధ్య జన్మించిన విద్యార్థులు (8-9 ఏళ్లు).మండల స్థాయి ఎంపికలు: మార్చి 13 మరియు 15 తేదీల్లో నిర్వహించనున్నారు.ఎంపిక విధానం: ఫిజికల్ టెస్టులు (పరుగు, జంప్, త్రో మొదలైనవి) మరియు వైద్య పరీక్షల ఆధారంగా మూడు అంచెల్లో (మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి) ఎంపికలు ఉంటాయి.మొత్తం సీట్లు: 120 (బాలురు 60, బాలికలు 60).?దరఖాస్తు విధానం: ఆసక్తి గల వారు మార్చి 12లోపు tgss.telangana.gov.in వెబ్సైట్లో నమోదు చేసుకోవాలి.పూర్తి వివరాలకు జిల్లా క్రీడా శాఖ అధికారులను సంప్రదించాలని ఎంఈఓ సూచించారు.

## గూడూర్‌లో పశు వైద్యశాలను నిర్మించండి

**పాలమూరు ఎంపీ డీకే.అరుణమ్మకు కొత్తూరు మండల అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి వినతి**

**సానుకూలంగా స్పందించిన ఎంపీ, పశు వైద్యశాల నిర్మాణానికై రాష్ట్ర పశుసంవర్ధక శాఖకు ఆదేశం**



రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం గూడూర్ గ్రామంలో పాడి సంపద సంరక్షణ లక్ష్యంగా గూడూర్ గ్రామంలో పశు వైద్యశాలను ఏర్పాటు చేసి డాక్టర్ని నియమించాలని పాలమూరు ఎంపీ డీకే అరుణమ్మ గారిని వేడిన కొత్తూరు మండల బిజెపి అధ్యక్షులు అత్తాపురం మహేందర్ రెడ్డి. స్పందించిన అరుణమ్మ గారు గూడూర్ గ్రామంలో పశు వైద్యశాల ఏర్పాటు చేసి డాక్టర్ను నియమించాలని పశుసంవర్ధక శాఖ రాష్ట్ర సంచాలకులను ఆదేశించారు. ఈ సందర్భంగా గూడూర్, పరిసర గ్రామాల పాడి పశు సంరక్షణకు సహకరించిన పాలమూరు ఎంపీ డీకే.అరుణమ్మ గారికి అత్తపురం మహేందర్ రెడ్డి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బిఆర్ఎస్ పార్టీలోకి చేరిన చిన్న గోల్కొండ గ్రామ నాయకులు

**పార్టీని మరింత బలేపేతం చేయాలి కార్తీక్ రెడ్డి**



**రంగారెడ్డి జిల్లా మీడియా టుడే ప్రతినిధి 5**

జిహెచ్ఎంసీ 118 శంషాబాద్ డివిజన్ నాయకుడు రాచమల్ల జయసింహ గారి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ పార్టీలో చేరిన చిన్నగోల్కొండ గ్రామానికి చెందిన నాయకులు.ఈరోజు కార్తిక్ రెడ్డి గారి చేతులమీదుగా బీఆర్ఎస్ పార్టీ కండువాలు కప్పుకుని చిన్నగోల్కొండ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎంపిటిసి, పాక్స్ మాజీ డైరెక్టర్ రామగళ్ల జంగయ్య గారు మరియు వారి అనుచరులు బీఆర్ఎస్ పార్టీ విధానాలు, నాయకత్వంపై నమ్మకం ఉంచి పార్టీలో చేరడం జరిగింది. ఈ సందర్భంగా బిఅరెస్ పార్టీ ఇంచార్జి కార్తిక్ రెడ్డి గారు మాట్లాడుతూ పార్టీ ని గ్రామాలలో బలోపేతం చేయాలని అందరూ కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు.పార్టీలో చేరిన వారిలో రామగళ్ల జంగయ్య, సారా బాలరాజ్ గౌడ్, రామగాళ్ల చరణ్ తేజ, ఉస్మాన్, ప్రభాకర్, నగేష్, మొహమ్మద్, షేకర్, సురేష్ మరియు ఇతర నాయకులు ఉన్నారు.ఈ కార్యక్రమంలో శంషాబాద్ బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మంచర్ల మోహన్ గారు పాల్గొన్నారు. అలాగే సీనియర్ నాయకులు కొనమొల్ల శ్రీనివాస్, బుచ్చిరెడ్డి, చిన్నగండు రాజేందర్, మంచర్ల శ్రీనివాస్, కొలను ప్రదీప్ రెడ్డి, సయ్యద్ గౌస్, చిలకమర్రి పరందాములు, పవిత్ర సాగర్, రమేష్ రాథోడ్, వెంకట్ రెడ్డి, గుంటి చరణ్, కుమ్మరి అర్జున్, కుమ్మరి గిరి, హనుమంతు ముదిరాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు మరియు ప్రజలకు అందిస్తున్న సేవలను చూసి మరింత మంది నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారని తెలిపారు.

## శనివారం రోజు న్యాయ నిర్మాణ్ భవన్‌కు శంకుస్థాపన

**జిల్లా ప్రధాన న్యాయమూర్తి, పి .నీరజ**




**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే : మార్చి 05:**

సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నూతన న్యాయస్థాన భవన సముదాయానికి శ్రీకారం జరగనుంది. పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా రూపు దిద్దుకోనున్న న్యాయస్థాన భవనానికి ఈ నెల 7 వ తేది శని వారం ఉదయం 10 గం.లకు శంకుస్థాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి పి నీరజ వెల్లడించారు. రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, హైకోర్టు న్యాయమూర్తి కం జిల్లా కోర్టు పరిపాలన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ తుకారాం జి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారు. వీరితోపాటు జస్టిస్ పి శ్యామ్ కోసి, జస్టిస్ కె లక్ష్మణ్, జస్టిస్ విజయ సేన్ రెడ్డి, జస్టిస్ వేణుగోపాల్, జస్టిస్ పుల్లా కార్తీక్, జస్టిస్ జె శ్రీనివాస్ రావు, జస్టిస్ నందికొండ నర్సింగరావు తదితరులు హాజరవుతున్నట్లు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు జూపల్లి శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లాలో అధికార అనధికార ప్రముఖులు న్యాయవాదులు న్యాయస్థానం ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు

## శాంతి భద్రతల పరిరక్షణకు దోహదపడండి

**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలుసుకున్న పట్టణ నూతన సీఐ సీతారాం షాద్ నగర్ పట్టణంలో శాంతి పద్ధతుల పరిరక్షణకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ ప్రజారక్షణ దోహదపడాలని షాద్ నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ సూచించారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ను సిఐ సీతారాం మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పూల బొకే అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సూచిస్తూ.. ప్రజా రక్షణ విషయంలో ఎక్కడ అలసత్వం వహించకూడదని బాధితులకు తక్షణ పోలీసు సాయి మందే విధంగా విధుల్లో చురుకుగా పనిచేయాలని ఈ సందర్భంగా సూచించారు. ఎమ్మెల్యే వెంటా డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు

# అక్రమ క్రషర్ పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి




**రంగారెడ్డి జిల్లా మీడియా టుడే ప్రతినిధి.**

రాజేంద్రనగర్ పరిధిలోని గ్రామ సమీపంలో క్రెషర్ ను సందర్శించిన టిఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఎమ్మెల్సీ దాసోజి శ్రావణ్ కార్తీక్ రెడ్డి. దాసోజ శ్రావణ్ మాట్లాడుతూ శ్రావణ్ మాట్లాడుతూ కొత్వాల్ గూడ లోని క్రషర్ మిషన్ తెలంగాణ రాష్ట్రంలో ఒక ప్రక్క రేవంత్ రెడ్డి దోచుక తింటున్నాడు మరో ప్రక్క పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దోచుక తింటున్నారని వీరిద్దరూ కలిసి దుర్మార్గమైన మైనింగ్ వ్యాపారం చేపడుతున్నారని అన్నారు. ఈ ప్రాంతంలో శబ్ద కాలుష్యం తో పాటు పర్యావరణ కాలుష్యం. భారీ ఎత్తుగా ఏర్పడుతున్నాయని అన్నారు, ఓ ఆర్ ఆర్ రోడ్డుకు అతి సమీపంలో క్రషర్ కు ఎలా అనుమతులు ఇస్తారని అన్నారు. మైనింగ్ ద్వారా సొమ్మును దోచుకుంటున్నార . ప్రజల సొమ్మును ఇష్టం వచ్చినట్టుగా గద్దె మీద ఉన్నామని మైనింగ్ వ్యాపారం నడిపిస్తున్నారు వీరికి తగిన బుద్ధి చెబుతామని సూచించారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కావచ్చు రేవంత్ రెడ్డి కావచ్చు వీరు అడుగున దోపిడీ చేస్తున్నారని ప్రశ్నించారు. చట్టాన్ని గౌరవించకుండా చట్టాన్ని నడిపిస్తున్నారని అన్నారు తెలంగాణ ప్రజలే గమనించాలని సూచించారు. గ్రామాలలో సొంత గృహ నిర్మాణానికి ఇసుకను వాగులలో నుంచి తీసుకొని వస్తే వారిపై కేసులు వేసి జైల్లో పెడుతున్నారు టాక్టర్లను సీజ్ చేస్తున్నారు. దేవాలయ నిర్మాణ కోసం ఇసుక తెస్తే కూడా వాటిపై చర్యలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ కూతబెట్టు దూరంలో శంషాబాద్ ఎయిర్పోర్ట్ సమీపంలో ఓఆర్ఆర్ రోడ్డు దగ్గర టన్నులకొద్దీ క్రెషర్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు మొత్తం కలిసి ఈ దందా చేసినారు ఎందుకు ఇప్పటి వరకు పంచాయతీ సెక్రెటరీ ఆపలేరు శంషాబాద్ ఎమ్మార్వో దీనిపై చర్యలు ఎందుకు తీసుకోలేరు. శంషాబాద్ మండలంలోని 111 ఉండడం వలన అక్రమ నిర్మాణాలకు ఎలాంటి పర్మిషన్ లేదని ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు కానీ ఈ క్రషర్ మిషన్ అధికారులకు కనబడడం లేదని సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం బి ఆర్ ఎస్ పార్టీ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి కౌన్సిలర్ కొనమోల శ్రీనివాస్ జయసింహ మోహన్ రావు, టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# సాధ్యమైనంత త్వరగా ఇందిరమ్మ ఇండ్లు పూర్తి చేయాలి

**గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలి - కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**సిరిసిల్లలో పలు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల పరిశీలన**

**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే : మార్చి 05**

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు సాధ్యమైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ సూచించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నాలుగో వార్డులో ఎలిగేటి రూపిక, కొండబత్తిని పందరి, కొయ్యాడ మానస ఇందిరమ్మ ఇళ్లు నిర్మించుకుంటుండగా, కలెక్టర్ గరిమ అగ్రవాల్ గురువారం పరిశీలించారు. ఇందిరమ్మ ఇల్లు ఎప్పుడు మొదలు పెట్టారో ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇండ్ల లబ్దిదారులు ప్రభుత్వ ఆర్థిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, త్వరితగతిన ఇళ్లు పూర్తి చేసుకోవాలని పిలుపు నిచ్చారు. గృహ ప్రవేశానికి సిద్ధం చేయాలని సూచించారు. హౌసింగ్. మున్సిపల్ అధికారులు ఇండ్ల నిర్మాణాల ఫోటోలు ఎప్పటికప్పుడు ఆన్లైన్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. సమావేశంలో హౌసింగ్ పీడీ సాజిద్, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా తదితరులు పాల్గొన్నారు.

**ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్**



ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకస్మిక తనిఖీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఇంటర్ పరీక్ష కేంద్రంలో కలెక్టర్ తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, కనీస వసతుల కల్పనను పరిశీలించి, అధికారులతో మాట్లాడారు. పరిశీలనలో తహసీల్దార్ మహేష్ కుమార్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

# మత్తు పదార్థాల మాయలో పడొద్దు

**ఆరోగ్యమే అసలైన సంపద - విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి - ఎస్సై హరి ప్రసాద్,**




**మీడియా టుడే/మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా: కీసర మార్చ్ 05**

మత్తు పదార్థాలు, డ్రగ్స్, మత్తు పానీయాల వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు కీసర మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో వ్యాసరచన పోటీలు గురువారం నిర్వహించారు. వీ చారిటీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, చైర్మన్ బండారి శ్రీనివాస్ రెడ్డి సౌజన్యంతో ఈ పోటీలు నిర్వహించి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కీసర పోలీస్ స్టేషన్ సబ్ఇన్స్పెక్టర్ హరి ప్రసాద్, మెడికల్ ఆఫీసర్ (పీడీకే) డాక్టర్ సింధూజ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,.. మత్తు పదార్థాలు, డ్రగ్స్, మత్తు పానీయాలు యువత ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తాయని తెలిపారు. ఇవి మెదడు, గుండె, కాలేయం వంటి ముఖ్య అవయవాలపై ప్రతికూల ప్రభావం చూపడంతో పాటు మానసిక సమస్యలు, అలవాట్లు పెరగడానికి కారణమవుతాయని చెప్పారు. విద్యార్థులు చదువులపై దృష్టి పెట్టి ఇటువంటి చెడు అలవాట్లకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.మత్తు పదార్థాల వినియోగం వల్ల కుటుంబాలు ఆర్థికంగా, సామాజికంగా కూడా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. డ్రగ్స్, మత్తు పానీయాలు వాడటం వల్ల భవిష్యత్తు నాశనం కావడంతో పాటు నేరాలకు కూడా దారి తీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు.వీ చారిటీ ఫౌండేషన్ చైర్మన్ బండారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మత్తు పదార్థాల వినియోగాన్ని తగ్గించేందుకు అవగాహన కార్యక్రమాలు చాలా అవసరమని తెలిపారు.ముఖ్యంగా విద్యార్థుల్లో చిన్నప్పటి నుంచే మత్తు వ్యసనాలపై అవగాహన కల్పిస్తే భవిష్యత్తులో సమాజం ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు.మొదటి బహుమతి (రూ.3000) – బోయ విఘ్నేశ్వరి (10వ తరగతి),రెండో బహుమతి (రూ.2000) – సౌభియా (9వ తరగతి),మూడో బహుమతి (రూ.1000) – సీమా భుష్రా (8వ తరగతి),కన్సోలేషన్ బహుమతి (రూ.1000) – జగ్గుల కిరణ్ కుమార్ (10వ తరగతి) అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కీసర మండల బీజేపీ సీనియర్ నాయకుడు మెట్టు మహేందర్ యాదవ్, ఉపాధ్యాయులు కె. రవి చంద్రశేఖర్, ఆర్. వెంకటేశ్వర్లు, బి. వెంకటేశ్వర్లు, రామాదేవి, సుభద్రా దేవి, ఆర్. ఆనంద్, డి. సుశీలత, వై. చంద్రారెడ్డి, పి. చందర్, ఏఏపీసీ చైర్మన్ జబీనా ఫాతిమా పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి సహకరించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాంరెడ్డికి నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పాలకులు ఎల్లప్పుడూ ప్రజాహితమే కోరాలి

**సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు ధనుంజయ నాయుడు సూచన**

**( సూర్యాపేట జిల్లా)// హుజూర్ నగర్: మీడియా టుడే మార్చి 05:**

గురువారం సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో సిపిఐ ముఖ్యులతో కలిసి పాత్రికేయులతో మాట్లాడుతున్న ధనుంజయ నాయుడు పాలకులు ఎల్లప్పుడూ ప్రజాహితశీ కొరకు ప్రతిక్షణం పరితపించాలని ముఖ్యంగా రైతాంగం కోసం అహర్నిసలు కృషి చేయాలని అప్పుడే ప్రజల గుండెల్లో పాలకులకు చిరస్థాయి స్థానం లభిస్తుందని ఈ మధ్యకాలంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పనితీరు చూస్తుంటే ఎంతో బాధాకరంగా ఉన్నదని, ముఖ్యంగా రైతాంగానికి.యూరియా యాప్ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం తప్పుడు నిర్ణయం తీసుకుందని దానివల్ల రైతులు పడ్డ ఇబ్బందులు చెప్పనలువు కానివణి తాము వ్యవసాయం చేస్తున్న ప్రాంతానికి సుమారు 80 కిలోమీటర్ల దూరంలో యూరియా యాప్ వల్ల యూరియా లభిస్తుందని అట్టి యూరియాను తమ గ్రామానికి తెచ్చుకునేందుకు వేలాది రూపాయలు ఖర్చు పెట్టాల్సి వస్తుందని , దానితో పాటు రైతు భరోసా నవంబర్ నెలలో వేయాల్సి ఉన్నప్పటికీ మార్చి నెల వచ్చినప్పటికీ వాయిదాలు వేస్తూ ఈరోజు వరకు ఏ ఒక్కరి ఖాతాలో ఒక్క రూపాయి కూడా రైతు భరోసా జమ చేయలేదని వ్యవసాయశీ మీదనే ఆధారపడుతూ జీవిస్తున్న తెలంగాణ రైతాంగానికి ఇది ఆశనిపాతమని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల సందర్భంగా బీసీలకు 21 హామీలు ఇచ్చి ఉంటే ఏ ఒక్క హామీని అమలు చేయలేకపోయారని రాష్ట్రంలో ప్రధానమైన రైతాంగానికి మరియు బీసీలకు న్యాయం చేయకపోతే రాష్ట్రం ఎలా అభివృద్ధి చెందుతుందని ఆయన ప్రశ్నించారు. అలాగే ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఆకులూరు మురళి ఇచ్చిన విద్యా కమిషన్ నివేదిక కూడా తప్పులతడక గా ఉన్నదని అందువల్ల ఆనివేదికను ఆమోదించకుండా ప్రభుత్వ చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట నేరేడుచర్ల మండల సిపిఐ కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు చిలకరాజు శ్రీను,బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సహాయ కార్యదర్శి కొమర్రాజు వెంకట్,ఏఐవైఎఫ్ పట్లణ అధ్యక్షుడు పరికె భరత్,సిపిఐ నాయకులు జక్కుల రమణ ఉన్నారు.



# దోమల నివారణకు చర్యలేవి

### పలు గ్రామాలలో జనంపై దోమల దండయాత్ర



**రంగారెడ్డి జిల్లా మీడియా టుడే ప్రతినిధి మార్చి 05**

కొత్తూరు మండలం మరియు నందిగామ మండల పరిధిలోని పలు గ్రామపంచాయతీలో దోమల సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. గ్రామంలో కాలువలు శుభ్రం చేయకపోవడం, మురికి నీరు నిల్వ ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరిగి ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నారూ . సాయంత్రం అయ్యేసరికి గ్రామంలో దోమల దండయాత్ర మొదలవుతుండడంతో చిన్నపిల్లలు, వృద్ధులు నిద్రపోవడానికే ఇబ్బంది పడుతున్నారు.గ్రామ సభలో దోమల నియంత్రణపై చర్చ జరిగినప్పటికీ, ఇప్పటివరకు గ్రామపంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫాగింగ్ చేయడం, బ్లీచింగ్ పొడి చల్లడం వంటి చర్యలు చేపట్టకపోవడంతో డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి గ్రామంలో ఫాగింగ్ నిర్వహించి, మురికి నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని దోమల నియంత్రణకు తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# రాజన్న సిరిసిల్ల జిల్లాలో నూతన సర్కిల్ ఇన్ స్పెక్టర్లకు ఉత్తర్వులు జారి

**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే : మార్చి 05:**

రాజన్న సిరిసిల్ల పట్టణ సీఐ గా నెమ్మని శ్రీనివాస్....జిల్లా డీ సి ఆర్ బీ (ఙజ=దీ) లో ఉన్న కదిర నాగేశ్వరరావును సిరిసిల్ల రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీ.. సిరిసిల్ల రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా ఉన్న మొగిలిని డిసిఆర్బికి బదిలీ.. కరీంనగర్ పిసిఆర్ (గ్రాజ=) లో పని చేస్తున్న ఓదెల వెంకటేశ్ ను ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా జనరల్ ఆఫ్ పోలీస్ ఐజీపీ, ఎస్. చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారి

# వేములవాడలో లాడ్జిలపై పోలీసుల నిఘా

**నిర్వాహకులకు కఠిన హెచ్చరికలు జారి స్పష్టమైన ఆదేశాలు**

**అతిథుల పూర్తి వివరాలు నమోదు చేయాలి**



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే : మార్చి 05 :**

వేములవాడ పట్టణ పరిధిలోని లాడ్జిలు మరియు వసతి గృహాల నిర్వహణపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు.ఈ నేపథ్యంలో లాడ్జిలు, గెస్ట్ హౌస్‌ల నిర్వాహకులతో టౌన్ పోలీస్ స్టేషన్‌లో పట్టణ సిఐ వీరప్రసాద్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రతా పరమైన అంశాలు చట్టపరమైన బాధ్యతలపై నిర్వాహకులకు సమగ్ర అవగాహన కల్పించారు. ప్రతి లాడ్జిలో బస చేసే అతిథుల పూర్తి వివరాలను రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు పత్రాలను పరిశీలించి వాటి ప్రతులను భద్రపరచాలని సూచించారు. భద్రతా దృష్ట్యా లాడ్జి ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, రికార్డింగ్స్‌ను నిర్దిష్ట కాలం వరకు భద్రంగా ఉంచాలని తెలిపారు. అలాగే 18 సంవత్సరాల లోపు మైనర్లకు తల్లిదండ్రులు లేదా చట్టబద్ధ సంరక్షకులు లేకుండా గదులు ఇవ్వకూడదని స్పష్టం చేశారు. లాడ్జి గదులు మరియు ప్రాంగణంలో మద్యపానం పూర్తిగా నిషేధించాల్సిందిగా ఆదేశించారు. నిబంధనలు, నిషేధాలు మరియు పోలీసు సూచనలకు సంబంధించిన బోర్డులను స్పష్టంగా ప్రదర్శించాలని తెలిపారు. పోలీసుల సూచనలు, చట్టపరమైన నిబంధనలు ఎవరైనా ఉల్లంఘించినట్లయితే సంబంధిత చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని వేములవాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం లాడ్జి నిర్వాహకులు పూర్తిగా సహకరించాలని తెలిపారు

# సిఐ విజయ్ కుమార్ కు ఘనంగా వీడ్కోలు పలికిన సిబ్బంది

**రంగారెడ్డి జిల్లా మీడియా టుడే ప్రతినిధి**



రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ సీఐ విజయ్ కుమార్ బదిలీపై కమిషనరేట్ కు వెళ్తున్న సందర్భంగా గురువారం షాద్ నగర్ ఎస్సైలు, ఏఎస్ఐ లు, కానిస్టేబుల్‌లు, ఎస్ఓ టి పోలీసులు, సిబ్బంది ఘనంగా వీడ్కోలు పలికారు. భవిష్యత్తులో సీఐ విజయ్ కుమార్ ఉన్నత పదవులను అలంకరించాలని సిబ్బంది ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సిఐ విజయ్ కుమార్ ను పూలమాలలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో,డి ఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు సుశీల, ప్రణయ్, శివారెడ్డి, రాజేష్, ఏ ఎస్ఐలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలతోనే కోదాడ అభివృద్ధి సాధ్యం

### మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్



**కోదాడ, మార్చి 05 (మీడియా టుడే)–:**

అప్పుడు ఇప్పుడు ఎప్పుడు కోదాడ నియోజకవర్గం అభివృద్ధి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మా రెడ్డి తోనే సాధ్యమవుతుందని కోదాడ వ్యవసాయం మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ వేపూరి తిరుపతమ్మ సుధీర్ అన్నారు. గురువారం వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో చైర్మన్ అధ్యక్షతన కోదాడ పట్టణ నూతనంగా ఎన్నికైన చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గం అభివృద్ధి చేయడానికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి నాయకత్వంలో వేలకోట్ల రూపాయలు నిధులు తీసుకువచ్చి కోదాడ నియోజకవర్గం లో గడిచిన 30 సంవత్సరాల నుండి అవినీతి మచ్చ లేకుండా పాడన కొనసాగిస్తున్న ఘనత మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి దక్కుతుందన్నారు తాగునీరు సాగునీరు డ్రైనేజ్ సిసి రోడ్లు అన్ని గ్రామాలకు రోడ్లు సౌకర్యం తో పాటు విద్య వైద్యం ఇందిరామ్మ ఇల్లు తో ప్రజలకు బావితరాలకు ఉపయోగపడే విధంగా ప్రణాళికలు రచించి ఎలాంటి వర్గ బేధాలు లేకుండా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు.మచ్చలేని నాయకుల నాయకత్వంలో మనందరం పనిచేయడం అదృష్టమన్నారు నూతన పాలకవర్గ సభ్యులు కోదాడ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేయాలని భావితరాలకు ఉపయోగపడే విధంగా సంక్షేమమ్ అభివృద్ధిని అందించాలని వారిని ఆకాంక్షించారు అనంతరం చైర్మన్ వైస్ చైర్మన్ కౌన్సిలర్లను మార్కెట్ చైర్మన్ పాలక సభ్యులను ఘనంగా సన్మానించారు కార్యక్రమాల్లో మున్సిపాలిటీ చైర్మన్ ఎర్నేని కుసుమ బాబు వైస్ చైర్మన్ రాజేశ్వరి మున్సిపాలిటీ కౌన్సిలర్లు మార్కెట్ కమిటీ డైరెక్టర్లు వీరబాబు వేంకట్ రెడ్డి సూర్యం వేంకటేశ్వర్లు కోటయ్య మణెమ్మ నర్సిరెడ్డి శ్రీను అభిరామ్ శ్రీనివాస్ అమర్ సింగ్ వేణు తదితరులు ఉన్నారు.

# మార్చ్ 6 నుంచి 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహణ

**జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి - మార్చి 12న జిల్లా స్థాయిలో సర్పంచ్, కౌన్సిలర్ లకు వర్క్ షాప్ నిర్వహణ**

**ప్రతి కార్యాలయంలో పెండింగ్ ఫైల్స్ 10 రోజులలో క్లీయర్ చేయాలి**

**మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు**

**ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణపై జిల్లా అధికారులతో సమీక్ష**



**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**

ఖమ్మం : ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మార్చి 6 నుంచి 15 వరకు గ్రామ, పట్టణంలోని ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ చేపట్టాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు.ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ అమలుపై గురువారం జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తుందని అన్నారు. మార్చి 6న ఉదయం 10 గంటలకు జిల్లా ఇంచార్జి మంత్రివర్యులు, మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. మార్చి 6 నుంచి మార్చి 15 వరకు పారిశుద్ధ్య నిర్వహణ, ఫైల్ క్లియరెన్స్ అంశాలపై ప్రాధాన్యత తో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో మాత్రమే కాకుండా ప్రతి ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని, పాత ఫర్నీచర్ తొలగించాలని, దీనిపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలలో పెండింగ్ ఉన్న ఫైల్స్ 10 రోజులలో క్లియర్ చేయాలన్నారు. పంచాయతీ, మున్సిపల్ శాఖ అధికారులు 10 రోజుల పాటు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించాలని, ఉదయం డిఎల్ పిఓ, ఎంపిఓ, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపల్ కమీషనర్ ఫీల్డ్ లెవల్ లో తనిఖీలు నిర్వహిస్తూ ఎక్కడా రోడ్డుపై చెత్త లేకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వార్డు సభ్యులు, సర్పంచ్, మున్సిపల్ చైర్ పర్సన్, మేయర్ వంటి ప్రజాప్రతినిధులను పూర్తి స్థాయిలో భాగస్వామ్యం చేయాలని అన్నారు. పబ్లిక్ ప్లేసెస్ లో పారిశుద్ధ్యశీ పట్ల అత్యంత ప్రాధాన్యత కల్పించి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.మార్చి 12న జిల్లా స్థాయిలో సర్పంచ్, పట్టణాలలోని కౌన్సిలర్ లకు వర్క్ షాప్ నిర్వహిస్తున్నా మని, దీనికి ప్రతి ఒక్కరు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. 99 రోజుల ప్రత్యేక కార్యాచరణ ముగిసే నాటికి ఖమ్మం జిల్లాలో 10 వేల ఇందిరమ్మ ఇండ్లు గృహ ప్రవేశానికి సిద్ధం చేసేలా స్థానిక అసిస్టెంట్ ఇంజనీర్లు పని చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఇంచార్జి మంత్రి వర్యుల ఆధ్వర్యంలో జరిగే సన్నాహక కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా పూర్తి చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, జిల్లా విద్యా శాఖ అధికారిణి చైతన్య జైని, జిల్లా వైద్య, ఆరోగ్య అధికారి డా. రామారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మల శిబిరంలో అంతర్మధనం

### దీనికి కారణం ఎవరు

**మీడియా టుడే ఖమ్మం ఆర్సి**




ఖమ్మం : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల గుడిసెల తొలగింపు అంశం మంత్రి తుమ్మల నాగేశ్వరావు ప్రతిష్టను దిగజార్చిందనడంలో ఎటువంటి సందేహం లేదు. నలభై యేండ్ల రాజకీయ చరిత్రలో ఏనాడూ ఇన్ని ఆరోపణలు ఎదురుకున్న సందర్భం దాదాపు లేదనే చెప్పాలి. రాజకీయ ఆరోపణలు పక్కన పెడితే సుధీర్ఘ రాజకీయ ప్రయాణంలో చిన్న అవినీతి మచ్చ లేకుండా సాఫీగా సాగుతున్న తరుణంలో కొంతమంది వ్యక్తులు, ప్రత్యర్థి పార్టీలు, కలిసి చేసిన దుష్ప్రచారం వలన ఇన్నేళ్లుగా నిబద్ధతతో కాపాడుకుంటు వస్తున్న పరువు ప్రతిష్టలు దిగజారాయనే అంతర్మధనంలో మంత్రి తుమ్మల రాజకీయ ఆరంభం నుండి కలిసి నడిచిన ప్రధాన అనుచరులు ఉన్నట్లు తెలుస్తుంది. ఈ మొత్తం వ్యవహారం వెనుక ఏమి జరిగిందనేది త్వరలోనే బయటకు వస్తుందని తమ ఆశభావాన్ని వ్యక్తం చేసారు. మంత్రి తుమ్మలను తప్పుదోవ పట్టించింది ఎవరుముఖ్యంగా వెలుగుమట్ల భూదాన్ భూముల్లో పేదల గుడిసెలు తొలగించే విషయంలో భిన్న వాదనలు విన్పిస్తున్నాయి. నిజంగా ఈ విషయంలో తుమ్మల ప్రమేయం ఉందా? ,ఒకవేళ ఉన్నా చట్టపరంగా ఎలా ఉంటే ఆలా వెళ్ళండని చెప్పి ఉంటాడు తప్ప నాలుగు జిల్లాల పోలీసులను మోహరించి పేదల గుడిసెలను ఇంత దారుణంగా కూల్చమని చెప్పి ఉండడు అనే వాదన ఖమ్మం జిల్లా ప్రజల్లో బలంగా వినిపిస్తుంది. వాస్తవానికి తుమ్మలకు ఇలాంటి వివాదాలకు స్వతహాగా దూరంగా ఉంటాడనే మంచి పేరు ఉంది. ప్రజా ప్రయోజనాలు తప్ప వ్యక్తిగత ప్రయోజనాలు ఆశించని వ్యక్తిగా ఖమ్మం జిల్లా ప్రజల్లో గుర్తింపు ఉంది. ఒక విధంగా చెప్పాలంటే ఈ మొత్తం వ్యవహారంలో కొంతమంది వ్యక్తులు చూపించిన అత్యుత్సాహం మంత్రి తుమ్మల కొంప ముంచిందని మంత్రి తుమ్మల అనుచరులు డైరెక్టుగానే వ్యాఖ్యానిస్తున్నారు. తుమ్మల మీద అభిమానం ఉన్న కార్యకర్తలు క్యాంపు కార్యాలయం వైపు ఎందుకు పోవడం లేదుఈ విషయం ఒక్కటే కాకుండా తన క్యాంపు కార్యాలయంలో జరిగే కార్యకలాపాలు కూడా కొత్త తలనొప్పులు తెచ్చి పెడుతున్నాయి. సహాయం కోసం క్యాంపు కార్యాలయానికి వచ్చి వెళ్లే కార్యకర్తల విషయంలో ఇంచార్జిగా వ్యవహరించే ఒక వ్యక్తి కనీస మర్యాద లేకుండా మాట్లాడతాడని కార్యకర్తలు వాపోతున్నారు. తండ్రి క్యాంపు ఆఫీసులో చక్రం తిప్పుతుంటే కొడుకు మున్సిపాలిటీలో చక్రం తిప్పుతున్నాడని ,చేసేది అటెండర్ ఉద్యోగం అయినప్పటికీ మంత్రి తుమ్మల పేరు చెప్పి తోటి ఉద్యోగులను బెదిరించి తన వ్యక్తిగత పైరవీల కోసం ఉద్యోగులను ఇబ్బందులకు గురించేస్తున్నాడని కార్పొరేషన్ ఉద్యోగులు గోడు వెళ్ళబుచ్చుకుంటున్నారు. ఇక్కడ ఒక విషయం నిశితంగా గమనిస్తే మంత్రి తుమ్మల గెలిచిన కొత్తలో క్యాంప్ ఆఫీసు కార్యకర్తలతో కిట కిట లాడేది కానీ కాలక్రమేణా అక్కడ పరిస్థితులను గమనించి మంత్రి తుమ్మల మీద అభిమానం ఉన్నప్పటికీ అటువైపు పోవడం కూడా మానేశామని కార్యకర్తలు చెప్పడం విశేషం. మంత్రి తుమ్మల క్యాంప్ కార్యాలయాన్ని అడ్డాగా మార్చుకుంది ఎవరుఅంతే కాకుండా ఆ వ్యక్తులు నిత్యం క్యాంపు కార్యాలయంలో కూర్చుని మంత్రి వ్యక్తిగత సహాయకున్ని అడ్డం పెట్టుకుని రెవిన్యూ సంబంధిత వ్యవహారాలను చక్కబెట్టుకోవడంతో పాటు క్యాంపు కార్యాలయాన్ని అడ్డమైన సెటిల్మెంట్లకు అడ్డాగా మార్చారని, మంత్రి వ్యక్తిగత సహాయకున్ని కలవడం కోసం వెళితే ఆయన ముందు ఆ ఐదుగురు వ్యక్తులు కూర్చుని కదిలే పరిస్థితి ఉండదని, విషయం ఏదైనా ఉంటే మాకు చెప్పు మేము చూసుకుంటాం, ఆయనతో నీకేం పనంటూ సతాయిస్తారని కార్యకర్తలు వాపోతున్నారు, ముఖ్యంగా రఘునాథపాలెం మండలంలో ఒక సర్పంచ్ ను అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూముల అమ్మకం దగ్గర నుండి, మట్టి త్రవ్వకాలవరకు వీరి కనుసన్నలో జరుగున్నాయనే ఆరోపణలు ప్రధానంగా వినిపిస్తున్నాయి. అక్రమ సెటిల్మెంట్లు,పైరవీలు పరమావధిగా మారాయాఅదే విధంగా నిత్యం మంత్రి తుమ్మల వెంట వుండే ఇద్దరు ముఖ్య నాయకులపై కూడా తీవ్ర అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి,ఒక నాయకుడు మంత్రి తుమ్మలకు తెలియకుండా ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల పేరుతో భారీగా వసూళ్లు చేసినట్లు ఆరోపణలు విన్పిస్తున్నాయి,మంత్రి తుమ్మల పేరు చెప్పుకుంటూ పైరవీలే పరామవధిగా చేసుకుని కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్నట్లు కార్యకర్తలు చెప్పడం విశేషం, మరో నాయకుడు నిత్యం ప్రత్యర్థి పార్టీల నాయకులకు టచ్ లో ఉంటూ, వాళ్లకు సహాయ సహకారాలు అందించడంతో పాటు తన వ్యాపార కేంద్రాన్ని అడ్డాగా చేసుకుని అనేక సివిల్, ల్యాండ్ సెటిల్మెంట్స్ చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి,అంతే కాకుండా గత సార్వత్రిక ఎన్నికల్లో రఘునాథపాలెం మండల ఇంచార్జిగా వ్యవహరించిన నాయకునితో పాటు ఇద్దరు స్థానిక మండల నాయకులు ఒక సర్పంచ్, మాజీ సర్పంచులను అడ్డం పెట్టుకుని అక్రమంగా ప్రభుత్వ భూములు అమ్మకాలతో పాటుఅక్రమ మట్టి వ్యాపారాల్లో కూడా వీరి ప్రమేయం ఉన్నట్లు ఆరోపణలు వినీపస్తున్నాయి. ఇకైనా మంత్రి తుమ్మల ఇంటి దొంగల విషయంలో జాగ్రత్త వహిస్తారాఈ సందర్భంగా మంత్రి తుమ్మల కొంతమంది పాత తరం ప్రధాన అనుచరులు మాట్లాడుతూ నలభై యేండ్లుగా ఆయన అడుగు జాడల్లో నడిచామని ఆయనకు ఏనాడూ ఇలాంటి విపత్కర పరిస్థితి ఎదురు కాలేదని, ప్రజలకు ఉపయోగపడే పనులు తప్ప వ్యక్తిగత పనులు ఎవరికి చేయలేదని,మారిన రాజకీయ పరిస్థితుల్లో కొత్తగా పుట్టుకొచ్చిన కొంతమంది అనుచరుల మూలంగా నలభై యేండ్లుగా నిలబెట్టుకున్న నిబద్ధత, పరువు, ప్రతిష్టలు మంటగలిసి పోతున్నాయని,ఇప్పటికైనా మంత్రి తుమ్మల అలాంటి వారితో జాగ్రత్తగా ఉండాలని తుమ్మల అభిమానులు కోరుతున్నారు.

## క్రీడా పాఠశాలల ప్రవేశాల పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాఫ్ రిపోర్టర్ మీడియా టుడే : మార్చి 05**

క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ గరిమ అగ్రవాల్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఆవిష్కరించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ తెలంగాణా రాష్ట్రం లోని వివిధ క్రీడల పాఠశాలలు: హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ రీజనల్ స్పోర్ట్స్ స్కూల్ లో 2026-27 విద్యా సంవత్సరంలో 4.వ తరగతిలో ఆసక్తి గల బాలబాలికలు ప్రవేశము లేదా అడ్మిషన్ పొందే వివరాలతో రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్, తదితరులు పాల్గొన్నారు.

## సౌండ్ సిస్టమ్స్ అందజేత




**రాయికల్-మీడియా టుడే-మార్చి 5:**

రాయికల్ మండలం భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు గురువారం జాతీయ పండగలకు, పాఠశాలలో నిర్వహించే ఇతర కార్యక్రమాల కోరకు 10వేల విలువ గల 2రెండు సౌండ్ సిస్టమ్ బాక్సులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుర్రం భావన, జక్కుల చంద్రశేఖర్, మహేందర్ గౌడ్, ముత్యంరెడ్డి, జక్కుల రాజేంద్ర ప్రసాద్, ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, ఉపాధ్యాయులు శంకరయ్య, సత్యనారాయణ, సహబజ్ హుస్సేన్, సంజయ్ కుమార్, వేణుగోపాల్, సురేష్, పుష్పలత, భవాని, శైలజ, వంశీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేయాలి




**రాయికల్-మీడియా టుడే-మార్చి 6:**

నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ కట్కం రవీందర్ అన్నారు. రాయికల్ పట్టణంలోని పటేల్ విగ్రహం సమీపంలో టిజి ఎన్‌పిడిసిఎల్ సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా 9.8 లక్షల వ్యయంతో 160 కెవిఏ డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ ను ఏర్పాటు చేశారు. ఈ ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా తక్కువ వోల్టేజ్ సమస్యలు తగ్గి వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందనుందని మున్సిపల్ చైర్మన్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ బాట కార్యక్రమం నిర్వహించి విద్యుత్ భద్రతా చర్యలపై ప్రజలకు విద్యుత్ శాఖ ఏఈ నవీన్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సౌజన్య, కౌన్సిలర్లు రాకేష్ నాయక్, పుర్రె శ్రీధర్, వేముల మౌనిక, బత్తిని మహేశ్వరి, నాయకులు తురగ శ్రీధర్, మచ్చ శేఖర్, కునారపు భూమేష్, బత్తిని నాగరాజు, రాజు, విద్యుత్ సిబ్బంది శ్రీనివాన్, ననరసింహ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పది అంశాల ప్రత్యేక కార్యక్రమాలు



**రాయికల్-మీడియా టుడే-మార్చి 5:**

రాయికల్ మున్సిపాలిటీతో పాటు మండల వ్యాప్తంగా ఈ నెల 6నుంచి 15వరకు తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు పది అంశాల ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారు. రాయికల్ మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్పంచులకు, కార్యదర్శులకు గురువారం ఎంపిడిఓ చిరంజీవి ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. పర్యావరణ పరిశుభ్రత, కార్యాలయాలలోని పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయడం వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. తహసీల్దార్ నాగార్జున, ఎంపిఓ సుష్మ, ఏఈ పిఆర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి, పాఠశాలలు, అంగన్వాడీల్లో కలెక్టర్ అంకిత్ ఆకస్మిక తనిఖీలు

### విద్యార్థుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: జిల్లా కలెక్టర్ అంకిత్

### సేవాభావంతో పని చేయాలి.. విధి నిర్లక్ష్యంపై చర్యలు తప్పవు: కలెక్టర్ హెచ్చరిక



**మణుగూరు, మార్చి 5 (మీడియా టుడే):**


మణుగూరు మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ గురువారం సుడిగాలి పర్యటన నిర్వహించి పలు ప్రభుత్వ సంస్థల్లో ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ తనిఖీలలో భాగంగా మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల, గుండు సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం, ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు.మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్ ఆసుపత్రిలోని వార్డులు, ఔషధ నిల్వ గది, మందుల సరఫరా విధానం, ఔట్‌పేషంట్ విభాగం, సిబ్బంది హాజరు వివరాలను పరిశీలించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల సేవాభావంతో వైద్య సేవలు అందించాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆసుపత్రిలో 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఆసుపత్రి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.అనంతరం కలెక్టర్ మణుగూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, కిచెన్ షెడ్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారికి అందుతున్న సౌకర్యాలు, బోధన విధానం గురించి తెలుసుకున్నారు. కిచెన్ షెడ్‌లో ఆహార తయారీ విధానాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అనే విషయాన్ని ఆరా తీశారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు మరియు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారు పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారో అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం ఫలితాల వివరాలు తెలుసుకొని ఈ ఏడాది 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యతతో పాటు పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని, వారికి నాణ్యమైన ఆహారం అందించడం మన అందరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించే ఆహారం విషయంలో ఎటువంటి లోటుపాట్లు తలెత్తినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గిరి యూనిట్ ద్వారా సరఫరా అవుతున్న చిక్కీలను స్వయంగా రుచి చూసి వాటి నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే విద్యార్థులకు సిద్ధం చేసిన మధ్యాహ్న భోజనాన్ని కూడా రుచి చూసి ఆహార నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.ఆశ్రమ గిరిజన ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ తనిఖీ చేశారు. అక్కడి తరగతి గదులు, విద్యార్థుల హాజరు, బోధన విధానం అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. గుండు సింగారం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రం ప్రభుత్వ గిరిజన మోడల్ ప్రాథమిక పాఠశాలను కూడా కలెక్టర్ పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు అందిస్తున్న సౌకర్యాలు, పోషకాహారం పంపిణీ విధానం, పిల్లల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రంలోని వంటగది, స్టోర్ రూమ్, త్రాగునీటి సదుపాయం, పరిశుభ్రత పరిస్థితులను సమగ్రంగా పరిశీలించారు. స్టోర్ రూమ్‌లో నిల్వ ఉంచిన బియ్యం, పప్పులు, గుడ్లు మరియు ఇతర ఆహార పదార్థాల నాణ్యతను తనిఖీ చేసి గుడ్ల పరిమాణాన్ని పరిశీలించారు. పిల్లలకు అందించే పోషకాహారం మెనూ ప్రకారం సమయానికి అందుతున్నదా అనే విషయాన్ని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అలాగే కేంద్రంలో చిన్నారులకు అందిస్తున్న ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు, ఆటపాటల ద్వారా బోధన విధానాన్ని కూడా పరిశీలించారు. పిల్లలకు పోషకాహారం నాణ్యంగా, పరిశుభ్రంగా అందేలా, కేంద్రం పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ పరిశీలనలో కలెక్టర్ వెంట మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లేనినా, ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, వైద్యులు, ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, ఉపాధ్యాయులు విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హాఫీజ్పేట్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గంప్రమాణ స్వీకారం

### పాల్గొన్న కొండాపూర్ డివిజన్ కార్పొరేటర్ హమీద్ పటేల్

శేర్లింగంపల్లి మీడియా టుడే న్యూస్ మార్చి 5

హాఫీజ్పేట్ మున్నూరు కాపు సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం రోజున ఘనంగా నిర్వహించబడింది. ప్రేమ్ నగర్ ఏ బ్లాక్ లోని హాఫీజ్పేట్ మున్నూరు కాపు భవనం దగ్గర ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి సంఘ సభ్యులు, పెద్దలు, యువకులు మరియు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. సందర్భంగా నూతనంగా ఎన్నికైన గౌరవ అధ్యక్షులు వాసాల రాజు పటేల్, అధ్యక్షులు గాజుల మహేందర్ పటేల్, ప్రధాని కార్యదర్శి బత్తుల రవి పటేల్, కోశాధికారి మంగళరాపు చిన్న తిరుపతి పటేల్, కమిటీ సభ్యులు తాడేం మహేందర్ పటేల్, సాధన వేణి రాజు పటేల్, మంగళరాపు రజనీకాంత్ పటేల్, దేవులపల్లి బాలరాజు పటేల్, సుంకరి చందు పటేల్, కొలిపల్లి సతీష్ పటేల్, కాశెట్టి రమేష్ పటేల్, సుంకరి ఆంజనేయులు పటేల్ తమ పదవుల బాధ్యతలను స్వీకరించి, సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రమాణ స్వీకారం చేశారు. సమాజ ఐక్యతను బలోపేతం చేయడం, విద్యా రంగంలో విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడం, యువతకు ఉపాధి అవకాశాలపై మార్గదర్శనం చేయడం వంటి లక్ష్యాలతో పనిచేస్తామని వారు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రముఖులు నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, మున్నూరు కాపు సంఘం సమాజ అభివృద్ధికి చేస్తున్న సేవలను అభినందించారు. సంఘ సభ్యులు ఐక్యంగా కలిసి పనిచేస్తే మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి సమాజానికి ఆదర్శంగా నిలవగలరని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సంఘ పెద్దలు, మహిళా సభ్యులు, యువజన ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం సంఘ నాయకులు అతిథులకు మరియు హాజరైన సభ్యులకు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ



కార్యక్రమంలో కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ తో బాటుగా శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, మాదాపూర్ డివిజన్ గౌరవ మాజీ కార్పొరేటర్ శ్రీ వి. జగదీశ్వర్ గౌడ్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుట్టం పురుషోత్తం పటేల్, మున్నూరు కాపు పటేల్స్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొండా దేవయ్య పటేల్, మాజీ ఎమ్మెల్సీ శ్రీమతి ఆకుల లలిత పటేల్, మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి మంగళారపు లక్ష్మణ్ పటేల్, జర్నలిస్ట్ ఫోరమ్ అధ్యక్షులు కొత్త లక్ష్మణ్ పటేల్, గ్లోబల్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు రజనికాంత్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వాసాల వెంకటేశ్వర్లు పటేల్, గ్రేటర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఆర్ వి మహేందర్ పటేల్, శేరిలింగంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ నర్సింగరావు పటేల్, హాఫీజ్పేట్ మున్నూరు కాపు సంఘం మాజీ అధ్యక్షులు, గౌరవ అధ్యక్షులు పోగుల సత్యనారాయణ పటేల్, పెరుక రమేష్ పటేల్, కూనవేణి రమేష్ పటేల్, మంగళరాపు తిరుపతి పటేల్ తదితరులు పాల్గొన్నారు.

# వీడ్కోలు కార్యక్రమం



**రాయికల్-మీడియా టుడే-మార్చి 5:**

రాయికల్ మండలం భూపతిపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుర్రం భావన మహేందర్ మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులు సాధించాలని అన్నారు. విద్యార్థుల నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చివరగా 10వతరగతి విద్యార్థులు... ఉపాధ్యాయులందరికీ వారు బోధించిన అంశాలను గుర్తు చేసుకునే విధంగా మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ప్రధానోపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, నాయకులు మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, పాక్స్ మాజీ చైర్మన్ ముత్యంరెడ్డి, మాజీ ఎస్ఎంసి చైర్మన్ జక్కుల రాజేంద్ర ప్రసాద్, గుర్రం మహేందర్, ఉపాధ్యాయులు వేణుగోపాల్, వంశీధర్ రావు, శంకరయ్య, సత్యనారాయణ, సహబజ్ హుస్సేన్, సంజయ్ కుమార్, సురేష్ పుష్పలత, భవానీ, శైలజ, సరోజన, కమారుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలి

### - జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్

**మెట్ పల్లి మార్చ్ 5**

జగిత్యాల జిల్లా మెట్ పెల్లి మండలం వెల్లుల్ల గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని ఆయన సమీక్షించి, లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణానికి ఉపయోగిస్తున్న ఇటుకలు, ఇసుక, సిమెంట్ వంటి సామగ్రి ధరలు మరియు వాటి నాణ్యతపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.ఇళ్ల నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా పనులు నిర్వహించాలని సూచించారు. నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా వేగవంతంగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేస్తే ప్రభుత్వ నిధులు కూడా త్వరగా విడుదల అవుతాయని, అందువల్ల లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా పనులను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అధికారులు కూడా పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహకారం అందించాలని ఆయన ఆదేశించారు. ఈ పరిశీలనలో హౌసింగ్ అధికారి పీడీ ప్రసాద్, మెట్పల్లి ఎంపీడీవో మరియు గ్రామ సర్పం చు గూడూరు తిరుపతి గ్రామ కార్యదర్శి నారాయణతదితరులు పాల్గొన్నారు

# ఆశా వర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

**కుమ్మరికుంట్ల నాగన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు**




**మహబూబాబాద్, జిల్లా ప్రతినిధి, మార్చి. 5**

కంబాలపల్లి పీహెచ్సీ సెంటర్లో ఆశా వర్కర్ల సమావేశం అసీన అధ్యక్షతన నిర్వహించడం జరిగినది ఈ సమావేశానికి హాజరైన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కుమ్మరికుంట్ల నాగన్న మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు మేనిఫెస్టోలో ఆశా వర్కర్లకు నెలకు 15 వేల రూపాయలు వేతనం ఇస్తామని మేనిఫెస్టోలో పేర్కొని ఆశలకు హామీ ఇవ్వడం జరిగిందనీ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నర సంవత్సరాలైనా ఇప్పటివరకు ఆశా వర్కర్లకు ఒక్క రూపాయి వేతనం పెంచకపోగా గత రెండు నెలల నుండి వేతనాలు చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లించాలని. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కనీస వేతన 26 వేల రూపాయలు ఇవ్వాలని ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగాలు గుర్తించాలని ఆశా వర్కర్లకు ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలని ఆశ వర్కర్ కి వ్యక్తిగత బీమా సౌకర్యం కల్పించాలని ప్రమాదంలో మరణిస్తే ప్రతి ఆశ వర్కర్ కి 25 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా రూపంలోచెల్లించాలని అర్హులైన ఆశలకు ప్రమోషన్ ఇవ్వాలని ప్రమాదంలో ఆశా వర్కర్ చనిపోతే వారి కుటుంబంలో ఒకరి ఉద్యోగం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఇప్పటికైనా తక్షణమే ప్రభుత్వం స్పందించి వీరి సమస్యలు పరిష్కరించాలని లేనియెడల పెద్ద ఎత్తున ఆందోళన పోరాటం చేస్తారని ఆయన హెచ్చరించారు....

ఈ కార్యక్రమంలో. కరుణ సునీత రజిని సరిత సుకన్య సావిత్రి రమ్య విజయ కీర్తన సునీత సులోచన లక్ష్మి సైదమ్మ సరస్వతి పద్మ యాకమ్మ యాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు

# అంబరానింటిన సంబరాలు

**'వేం 'ను రాజ్యసభ సభ్యునిగా ఖరారు పట్ల హర్ష వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు**



**కేసముద్రం,మార్చి 05**

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారులుగా ఉన్న వేం నరేందర్ రెడ్డిని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం రాజ్యసభ సభ్యునిగా ఖరారు చేయడం పట్ల కేసముద్రం మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పటాసులు కాల్చి ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుక్షణం ప్రజల పక్షాన అందుబాటులో ఉంటున్న విదేయుడికి పట్టం కట్టిన కాంగ్రెస్ అధిష్టానానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు గుర్తింపు హోదా ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, జిల్లా, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ( పిపిటి )ప్రవేశ పరీక్ష దరఖాస్తు కు మార్చి 8 ఆఖరు తేదీ

**మహబూబాబాద్ మార్చి జిల్లా ప్రతినిధి**

హైదరాబాద్, ప్రగతి నగర్ లోని ప్రగతి విద్యాలయంలో 6,7 తరగతులలో ప్రవేశం పొందుటకు పీపుల్స్ ప్రోగ్రెస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రవేశ పరీక్ష ఈ నెల 15 న గర్ల్స్ హైస్కూల్ మహబూబాబాద్ నందు నిర్వహించనున్నట్లు టిఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏ మురళీకృష్ణ, ఎస్కె యాకూబ్ లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రవేశం పొందే వారు ఈ నెల 8 వ తారీఖు వరకు పై క్యూ ఆర్ కోడ్ ద్వారా లేదా ఫ్రజూం://టశీతీఎం.స్త్రశ్రీవ/ంన్ష్టచీూాఓచీనఓ9ంఖఱచీన్ఝూ ఈ లింక్ ద్వారా ఆన్లైన్ లో అప్లై చేసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలలో 5, 6 తరగతులు చదివే వారు మాత్రమే అర్హులు అన్నారు. తల్లి దండ్రులు లేని వారికీ, సింగిల్ పేరెంట్ ఉన్న వారికీ, నిరుపేదలైన వారికీ మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. 6 వ తరగతి లో చేరిన పిల్లలకు వారు ఉన్నత చదువులు(పీజీ స్థాయి వరకు) అభ్యసించేవరకు ఉచిత హాస్టల్ వసతితో విద్యను అందిస్తానన్నారు. ఆసక్తి కలిగిన వారు క్యూ ఆర్ కోడ్ లేదా లింక్ ద్వారా ఆన్లైన్ లో అప్లై చేసుకోవాలని కోరారు.

# "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" పకడ్బందీగా అమలు చేయాలి

**అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలి**

**ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు కార్యక్రమాలు**

**ఈ నెల 12 వ తేదీన సర్పంచ్, మున్సిపల్ చైర్మన్లు, వార్డు సభ్యులకు శిక్షణ**

**కలెక్టర్ గరిమ అగ్రవాల్**





**రాజన్న సిరిసిల్ల జిల్లా స్టాప్ రిపోర్టర్ మీడియా టుడే : మార్చి 05**

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 6వ తేదీ నుంచి జూన్ 12 వ తేదీ వరకు 99 రోజుల పాటు ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. "ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక" పై జిల్లాలో నిర్వహించాల్సిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, వైద్య అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత కాలపరిమితిలో లక్ష్యాలను సాధించాల్సిన బాధ్యత ఉందని వెల్లడించారు. ప్రతి జిల్లా అధికారి తమకు ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలకు అనుగుణంగా పథకాలు అమలు చేయాలని ఆదేశించారు. మండల అధికారులు తమ పరిధిలోని హౌసింగ్, పీఆర్, ఆర్ అండ్ బీ, సెస్ ఏఈలు, అంగన్వాడీ సూపర్ వైజర్లు, మండల వైద్యాధికారులు, ఎస్ హెచ్ఓ, పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించాలని సూచించారు. తమ పరిధిలోని అన్ని అంశాలపై చర్చించాలని, యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి ప్రజాప్రతినిధులను ఆయా కార్యక్రమాలకు ఆహ్వానించి సమన్వయంతో విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ నెల 12 వ తేదీన జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ ల సర్పంచులు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీల వార్డు సభ్యులు, చైర్మన్లకు ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక పై శిక్షణ ఉంటుందని వెల్లడించారు. ఆయా శాఖల పరిధిలో అమలు చేస్తున్న పథకాలు, వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని సూచించారు.

**ఐదు దశలో కార్యక్రమాలు**

ఏప్రిల్ 2 (మొదటి దశ)గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణఏప్రిల్ 16 (రెండో దశ)మండల స్థాయిలో కార్యక్రమాలుమే 2 (మూడో దశ)నియోజకవర్గ స్థాయిలో కార్యక్రమాలుమే 22 (నాలుగో దశ)జిల్లా స్థాయిలో విస్తృత కార్యక్రమాలుజూన్ 2 వ తేదీ (ఐదో దశ)రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు నిర్వహించనున్నారని వివరించారు. గ్రామ సభ సందర్భంగా వివిధ ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల జిల్లా అధికారులు తమ పరిధిలో చేపట్టనున్న పనులు, యాక్షన్ ప్లాన్, లక్ష్యాల వివరాలు వెల్లడించారు. వివిధ శాఖల షెడ్యూల్, కార్యక్రమాల వివరాలు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాల్లో ఫైళ్ల పరిష్కరణపురపాలక, పట్టణాభివృద్ధి, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, అలాగే అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మార్చి 6 వ తేదీ నుండి మార్చి 15 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

**ఆరోగ్యం**

వైద్య ఆరోగ్య శాఖ, మహిళా, శిశు అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఏప్రిల్ 6 వ తేదీ నుండి ఏప్రిల్ 11 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

**అరైవ్ అలైవ్**

హోం శాఖ, రవాణా శాఖల ఆధ్వర్యంలో ఏప్రిల్ 13 వ తేదీ నుండి ఏప్రిల్ 18 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

**సంక్షేమం**

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మరియు హౌసింగ్ శాఖల ఆధ్వర్యంలో ఏప్రిల్ 20 వ తేదీ నుండి ఏప్రిల్ 26 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

**శిశు భద్రత, రక్షణ -- "డ్రగ్స్‌కు నో చెప్పండి"**

వైద్య ఆరోగ్య శాఖ, మహిళా, శిశు అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో ఏప్రిల్ 27 వ తేదీ నుండి మే 2 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

**వ్యవసాయం**

వ్యవసాయ, రెవెన్యూ, నీటిపారుదల, ఇంధన శాఖల ఆధ్వర్యంలో మే 4 వ తేదీ నుండి మే 10 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

**విద్య**

విద్యాశాఖ ఆధ్వర్యంలో మే 11 వ తేదీ నుండి మే 16 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

**యువజన, క్రీడలు**

యువజన వ్యవహారాలు, పర్యాటక, క్రీడా శాఖల ఆధ్వర్యంలో మే 18 వ తేదీ నుండి మే 23 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

**మహిళలు**

మహిళా, శిశు అభివృద్ధి శాఖ, సెర్ప్ / మెప్మా ఆధ్వర్యంలో మే 25 వ తేదీ నుండి మే 30 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది.

**పర్యావరణం**

అటవీ, పర్యావరణ, విజ్ఞాన సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో జూన్ 1 వ తేదీ నుండి జూన్ 12 వ తేదీ వరకు ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్డీఓ గీత, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, డీడబ్ల్యూఓ లక్ష్మీరాజం, డీపీవో షరీఫుద్దిన్, జిల్లా వైద్యాధికారి రజిత, హౌసింగ్ పీడీ సాజిద్, డీ టీఓ లక్ష్మణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి రాందాస్ తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్పీ పార్టీలో చేరికలు

**రాజ్యాధికారమే. లక్ష్యంగా ముందుకు వెళ్లాలి. జిల్లా అధ్యక్షుడు.. ఉడుగుల .ఐలేష్ యాదవ్**

**దంతాలపల్లి. మార్చి.5**

నరసింహుల పేట దంతాలపల్లి. మండలాల నుంచి. తీన్మార్ మల్లన్న స్థాపించిన తెలంగాణ రాజ్యాధికార పార్టీలోకి గురువారం మహబూబాబాద్ జిల్లా టిఆర్పి అధ్యక్షులు ఉడుగుల ఐలేష్ యాదవ్. అధ్యక్షతన పలువురు. పార్టీలో చేరగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు అనంతరం దంతాలపల్లి మండలం అధ్యక్షుడిగా. కొండ వెంకన్న యాదవ్. ప్రధాన కార్యదర్శిగా. పులిగుజ్జ రామ్మూర్తి ముదిరాజ్ నర్సింహులపేట మండలా అధ్యక్షుడిగా. ఐల సాయికుమార్. ప్రధాన కార్యదర్శిగా కొండ వెంకన్న నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు ఐలయ్య యాదవ్ మాట్లాడుతూ ఆత్మగౌరవం, అధికారం, మన వాటా అనే నినాదంతో తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు తీన్మార్ మల్లన్న, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ముదిరాజ్ ఆదేశాల మేరకు పార్టీలోకి ఆహ్వానించడం జరిగిందని. తెలుపుతూ తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధినేత తీన్మార్ మల్లన్న బీసీ నినాదంతో బీసీల పట్ల జరుగుతున్న అన్యాయాలపై వారు చేస్తున్న పోరాటాలకు ఆకర్షితులై చాలామంది పార్టీలో చేరటానికి ముందుకు వస్తున్నారని అన్నారు. అలాగే జిల్లాలో గ్రామస్థాయి



నుండి పార్టీని బలోపేతం చేస్తూ,ప్రజల పక్షాన నిలబడుతూ, ప్రభుత్వాలు చేస్తున్న అవినీతిపై పోరాడుతామనీ,అదేవిధంగా రాబోయే రోజుల్లో మహబూబాబాద్ జిల్లాలో తెలంగాణ రాజ్యాధికారపార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తామని, రాబోయే మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో మెజారిటీ ఎస్సీ, ఎస్టీ, బీసీలను తెలంగాణ రాజ్యాధికార పార్టీ నుండి బరిలో నిలబెడతామని, వారి గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కష్టపడి జిల్లాలోని అత్యధిక సీట్లు తెలంగాణ రాజ్యాధికార పార్టీ గెలిచే విధంగా కార్యాచరణ చేస్తామని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికార పా ర్టీ జిల్లా యూత్ ప్రధాన కార్యదర్శి బండి సంతోష్ గౌడ్, నరసింహుల పేట మండల యూత్ అధ్యక్షులు విజయ్, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విప్లవ యోధుడు రాయల సుభాష్ చంద్రబోస్

**మహబూబాబాద్ మార్చి జిల్లా ప్రతినిధి**



.. భారత విప్లవోద్యమంలో ప్రజాయుద్ధ పందాను అభివృద్ధి చేసిన పోరాట యోధుడు రాయల సుభాష్ చంద్రబోస్ అని సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. ఈనెల 9, 10 తేదీలలో రాయల సుభాష్ చంద్రబోస్ 10 వ వర్ధంతి సందర్భంగా పోస్టర్స్ ను మహబూబాబాద్ లోని కోర్టు ఎదురుగా నేడు విడుదల చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పేదలకు రాజ్యాధికారం లక్ష్యంగా సాగుతున్న భారత విప్లవోద్యమంలో అతి-మిత వాదాలు, కరుడుగట్టిన అవకాశవాదం విప్లవోద్యమ నిర్మాణానికి పెద్ద ఎత్తున నష్టం కలిగించిందని అన్నారు. నేడు భారతదేశంలోని నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్ట అంచనా వేసి వెనుకబడిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థగా మన దేశాన్ని విశ్లేషణ చేయడం జరిగిందని అన్నారు. సిపిఐ(ఎంఎల్) ఏర్పాటు భారతదేశ చరిత్రలో విప్లవాత్మక ముందడుగు అని అన్నారు. మన దేశంలో మెజారిటీ ప్రజలు ఎదుర్కొంటున్న అధిక ధరలు,ఉపాధి సమస్య, మత వివక్షత, కుల ఉన్మాద దాడులు,నిర్వాసితుల సమస్యలు పెద్ద ఎత్తున పెరిగిపోతున్నాయని అన్నారు. వాటికి పరిష్కారాన్ని చూపటం లో విఫలమైన కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టడమే కాకుండా ప్రశ్నించే వారిని దేశద్రోహులుగా చూడటం రాజ్యాంగ వ్యతిరేకం అన్నారు. భారత పాలకులు అనుసరిస్తున్న దివాలకోరు అవకాశవాద విధానాలను ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ముక్తకంఠంతో నిరసించాలని అన్నారు. రాయల సుభాష్ చంద్రబోస్ పదవ వర్ధంతిని ఈ నెల 9వ తారీఖున జిల్లాలలో 10 న సుందరయ్య విజ్ఞాన కేంద్రం హైదరాబాదులో నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ సంస్మరణ సభలో ప్రముఖ రాజకీయ విశ్లేషకులు పరకాల ప్రభాకర్, ఐ వి రమణ రావు, పోటు రంగారావు, కేజీ రామచందర్,కె రమ తదితరులు ప్రసంగించనున్నారని తెలిపారు.ప్రజలు ప్రజాస్వామిక వాదులు పెద్ద ఎత్తున హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులు ఉమా గాని సత్యం, డివిజన్ నాయకులు బూర్గుల మోష, కందాల రంగయ్య, సట్ల యాకయ్య,తో పాటుగా సూరయ్య,వీరన్న,రామచందర్,బాలు తదితరులు పాల్గొన్నారు.

# ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి సాధ్యం: కేటీఆర్

**మూసీ సుందరీకరణపై వ్యాఖ్యలు -హైడ్రా చర్యలపై విమర్శలు**

**ప్రభుత్వానికి సవాల్ విసిరిన కేటీఆర్**



హైదరాబాద్, 5 మార్చి

విధ్వంసం చేయకుండా, ఎవరి ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి మరియు సుందరీకరణ పనులు చేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో మూసీ పరివాహక ప్రాంతంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేసినట్లు ఆయన గుర్తు చేశారు. ప్రజల ఆస్తులకు నష్టం కలగకుండా కూడా అభివృద్ధి సాధ్యమని అది నిదర్శనమని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని నాగోల్ ప్రాంతంలో ఉన్న మలినజల శుద్ధి కేంద్రాన్ని కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న చర్యలకు ఎలాంటి నియంత్రణ లేకుండా పోయిందని విమర్శించారు. పేదల ఇళ్లు కూల్చివేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ సుందరీకరణ పనులకు రూ.1.50 లక్షల కోట్లు అవసరమని ముఖ్యమంత్రి చెబుతున్నారని, అయితే అదే పనులను రూ.16 వేల కోట్లతోనే పూర్తి చేయవచ్చని కేటీఆర్ అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు తక్కువ వ్యయంతోనే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని ఆయన తెలిపారు. మూసీ సుందరీకరణ పనులను తమకు అప్పగిస్తే రూ.16 వేల కోట్లతోనే పూర్తి చేసి చూపిస్తామని కేటీఆర్ పేర్కొన్నారు. అంతేకాకుండా ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రజలు కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇచ్చారని, కానీ ఇప్పటి వరకు ఒక్క ఇంటినైనా నిర్మించినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని ఆయన సవాల్ విసిరారు.

# బమ్మృకున్-ఉద్-దౌలా చెరువు ప్రారంభానికి సన్నాహాలు

**మార్చి 8న ముఖ్యమంత్రి ప్రారంభం - ఎర్పాట్లను పరిశీలించిన హైడ్రా కమిషనర్**

**చెరువు సుందరీకరణ పనుల సమీక్ష**



హైదరాబాద్, 5 మార్చి

: చారిత్రక ప్రాధాన్యం ఉన్న బమ్మృకున్-ఉద్-దౌలా చెరువు ప్రారంభానికి ముహూర్తం ఖరారైంది. ఈ నెల 8వ తేదీ ఆదివారం సాయంత్రం 7.30 గంటలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఈ చెరువు ప్రారంభం కానుంది. అలాగే కూకట్‌పల్లిలోని నల్లచెరువును ఈ నెల 9వ తేదీన ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం బమ్మృకున్-ఉద్-దౌలా చెరువును సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. చెరువు సుందరీకరణ పనులను ఆయన సమీక్షించారు. చెరువు కట్టతో పాటు ఖాళీ ప్రదేశాల్లో నాటిన ఔషధ మొక్కలను పరిశీలించారు. పిల్లలు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన ఆట స్థలాలను కూడా ఆయన పరిశీలించారు. అన్ని వయసుల వారు సేదతీరేందుకు చెరువు కట్టపై ఏర్పాటు చేసిన గజబోలు, విశ్రాంతి స్థలాలను కూడా పరిశీలించారు. పాతబస్తీ సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ప్రధాన ద్వారం, చెరువు చరిత్రను వివరించే బోర్డులను కూడా ఆయన చూశారు. చెరువు ప్రారంభోత్సవం అనంతరం జరిగే సభ ఏర్పాట్లను కూడా హైడ్రా కమిషనర్ సమీక్షించారు. ఈ కార్యక్రమంలో హైడ్రా అదనపు కమిషనర్ ఆర్ సుదర్శన్, అదనపు సంచాలకులు వర్ల పాపయ్యతో పాటు పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లపై అధికారులు సమీక్ష నిర్వహించారు.

# మారుతున్న బిహార్ రాజకీయాలు

**బిహార్ ముఖ్యమంత్రి నితీష్ రాజ్య సభకు నామినేషన్**

హైదరాబాద్, 5 మార్చి

బిహార్ సీఎంగా సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన జేడీయూ అధ్యక్షుడు నీతీశ్ కుమార్ ఇక పెద్దల సభకు వెళ్లనున్నారు. ఈ మేరకు రాజ్యసభ అభ్యర్థిగా గురువారం ఆయన నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు ఎన్?డీఏ అభ్యర్థులు ఉపేంద్ర కుశ్వాహా, బీజేపీ చీఫ్? నితిన్ నబీన్? కూడా నామినేషన్ దాఖలు చేశారు. రాజ్యసభ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడంతో త్వరలోనే నీతీశ్ కుమార్ సీఎం పదవికి రాజీనామా చేయనున్నారు.త్వరలో బిహార్‌లో ఏర్పడబోయే నూతన ప్రభుత్వానికి తన సహకారం ఉంటుందని నీతీశ్ కుమార్ అంతకుముందు ఎక్స్‌లో పోస్టు చేశారు. శాసనసభ, శాసనమండలితో పాటు పార్లమెంటు ఉభయ సభల్లోనూ సభ్యుడిగా ఉండాలనేది తన ఆకాంక్ష అని అందులో రాసుకొచ్చారు. అదేవిధంగా రెండు దశాబ్దాలుగా తనను నమ్మి మద్దతు తెలిపిన వారికి ఆయన కృతజ్ఞతలు చెప్పారు. వారి మద్దతు వల్లే త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. రాజ్యసభ ఎంపీగా తన ప్రయాణాన్ని ప్రారంభించాలని, అయితే కొత్త బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా, బిహార్?తో తన బంధం కొనసాగుతోందని చెప్పారు. అదేవిధంగా భవిష్యత్తులోనూ బిహార్ అభివృద్ధికి కృషి చేస్తానని నీతీశ్ ఎక్స్?లో రాసుకొచ్చారు.



# విజయ్ దేవరకొండ రష్మిక దంపతులను కలిసిన ముఖ్యమంత్రి

**- నివాసంలో మర్యాదపూర్వక భేటీ - నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన సీఎం**

**- వివాహానంతరం ప్రముఖుల సందడి**



హైదరాబాద్, 5 మార్చి

ఇటీవల వివాహబంధంతో ఒక్కటైన సినీ నటులు విజయ్ దేవరకొండ, రష్మిక దంపతులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలుపుతూ వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆశీర్వదించారు. విజయ్ దేవరకొండ మరియు రష్మిక ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయపూర్‌లో కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో వివాహం చేసుకున్నారు. ఈ వివాహం తెలుగు సినీ పరిశ్రమలో ప్రముఖ చర్చనీయాంశంగా మారింది. వివాహానంతరం హైదరాబాద్‌లో ఘనంగా ఏర్పాటు చేసిన రిసెప్షన్ కార్యక్రమానికి పలువురు సినీ ప్రముఖులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు. ఈ వేడుకలో టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖ నటులు పాల్గొని దంపతులకు ఆశీస్సులు అందించారు. అదేవిధంగా వివాహ వేడుకల అనంతరం దంపతులు దేశంలోని పలు ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు సమాచారం. అభిమానులతో ఆనందాన్ని పంచుకునే భాగంగా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో మిఠాయిలను పంపిణీ చేసినట్లు కూడా తెలిసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దంపతులను మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలియజేయడం విశేషంగా మారింది. ఈ భేటీ సందర్భంగా సినీ, రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

# ఉపాధి హామీ కూలీలకు శుభవార్త

**వీబీజీరాంజి : కష్టాలకు చ్వక పడిుఖ్లీ:.. .**

**గురిఖించిప్రవఖుత్వం .ప్గామీణ చిబివృద్ధి శ్థఖ కమిటిుఖ్ డి.దివ్య. ఉతఖుఘ్వలు జారీ చ్వశ్ధసు**

కల్వ ర్. 5.మార్చి.

. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ కింద పనిచేసే కూలీలకు ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను తొలగిస్తూ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా హాజరు నమోదు విషయంలో నెట్‌వర్క్ సమస్యలు, మొబైల్ యాప్ పనితీరు వల్ల కూలీలు నష్టపోకుండా నిబంధనలను సులువు చేస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ డి.దివ్య ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్పుల కారణంగా ఉపాధి పనికి వెళ్లే కూలీలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరనున్నాయి. చాలాచోట్ల సిగ్నల్ లేకపోవడం వల్ల కూలీల హాజరు నమోదు కావడం లేదు. ఇకపై 'నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్' (నమ్మ్స్ ) యాప్‌లో ఆఫ్‌లైన్ మోడ్‌లో హాజరు తీసుకోవచ్చు. పని ప్రదేశంలో ఫొటోలు, వివరాలు రికార్డ్ చేసి, నెట్‌వర్క్ ఉన్న ప్రాంతానికి వచ్చాక రెండు రోజుల్లోపు (టీ ౦2) వాటిని అప్‌లోడ్ చేసే అవకాశం కల్పించారు. దీనివల్ల మారుమూల ప్రాంతాల్లో పని చేసే వారికి నెట్ వర్క్ సమస్య అనేదే ఉండదు.దీని ద్వారా.. ఫీల్డ్ అసిస్టెంట్లు లేదా మేట్‌ల మొబైల్ ఫోన్లు పనిచేయకపోయినా ఆందోళన చెందాల్సిన పనిలేదు. సంబంధిత ప్రోగ్రామ్ ఆఫీసర్ అనుమతితో మరో ఫోన్ ద్వారా 'జన్-మన్ రేగా' యాప్‌ను ఉపయోగించి హాజరు వేయవచ్చు. కేవలం ఫోన్ పాడైందనే కారణంతో కూలీల పని దినాలు వృధా కాకుండా ఈ నిబంధన ఉపయోగపడుతుంది.

# ఉప ముఖ్యమంత్రి కుమారుడి వివాహానికి గవర్నర్ హాజరు

**శంషాబాద్‌లో ఘనంగా వివాహ వేడుక**

**నూతన దంపతులకు ఆశీస్సులు -ప్రముఖుల సందడి**



హైదరాబాద్, 5 మార్చి

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహ వేడుక శంషాబాద్‌లోని జీఎంఆర్ అరేనాలో ఘనంగా జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. సూర్య విక్రమాదిత్య, సాక్షి వివాహం కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితుల సమక్షంలో ఆనందోత్సాహాల మధ్య జరిగింది. వివాహ వేడుకలో పలువురు రాజకీయ, సామాజిక రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొని నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ నూతన దంపతులను ఆశీర్వదించి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు. జీవితంలో విజయాలు, శ్రేయస్సు కలగాలని కూడా శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకకు హాజరైన అతిథులు నూతన దంపతులను అభినందించి, వారి కొత్త జీవిత ప్రయాణం ఆనందంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

# కేజీబీవీ పాఠశాలకు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**- 99 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా పరిశీలన**

**- విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్**

**- ఉపాధ్యాయులకు సమయపాలనపై హెచ్చరిక**



నిర్మల్, 5 మార్చి

జిల్లాలో అమలవుతున్న 99 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తెల్లవారుజామున కేజీబీవీ పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, నిర్వహణను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న అసెంబ్లీ కార్యక్రమం, విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మెస్ నిర్వహణ మరియు బోధన పరిస్థితులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాలను కూడా తెలుసుకున్నారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని కలెక్టర్ సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను మరింత పెంచాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ఈ తనిఖీలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, తహసిల్దార్ రాజు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



# సీఎం సలహాదారు పదవికి వేం రాజీనామా




సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి తన పదవికి రాజీనామా చేశారు. కాంగ్రెస్ అధిష్ఠానం ఆయనను రాజ్యసభ అభ్యర్థిగా ప్రకటించిన నేపథ్యంలో, గురువారం ఆయన తన రాజీనామా లేఖను సమర్పించారు. అనంతరం హైదరాబాద్లో రాజ్యసభ సభ్యుడిగా నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు.

# తిరుమలాయపాలెంలో 100 పడకల ఆసుపత్రికి శంకుస్థాపన

**- రూ.26 కోట్లతో ఆధునిక వైద్యసదుపాయాలు - డిసెంబర్ నాటికి పనులు పూర్తి చేయాలని ఆదేశం**

**- పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం లక్ష్యం - మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




**ఖమ్మం, 5 మార్చి**

ఖమ్మం జిల్లాలోని తిరుమలాయపాలెం మండల కేంద్రంలో రూ.26 కోట్ల వ్యయంతో నిర్మించనున్న 100 పడకల ఏరియా ఆసుపత్రి భవనానికి తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం మరియు సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ పేదవాడి సొంత ప్రాంతంలోనే కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఇప్పటివరకు ఈ ప్రాంతంలో కేవలం 30 పడకలతో అరకొర సదుపాయాలున్న ఆసుపత్రి మాత్రమే ఉండడంతో ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొనాల్సి వచ్చేదని మంత్రి గుర్తు చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఖమ్మం నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని పేర్కొన్నారు. కొత్తగా నిర్మించనున్న ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్లు, అత్యాధునిక వైద్య పరికరాలు మరియు మెరుగైన వైద్య సదుపాయాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.వైద్యసిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చించి ఆసుపత్రి భవనాలు నిర్మించినప్పటికీ డాక్టర్లు అందుబాటులో ఉండకపోతే ప్రజలకు ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. డాక్టర్లు, సిబ్బంది ఆసుపత్రి ప్రధాన కేంద్రంలోనే నివసిస్తూ రోగులకు సేవలు అందించాలని సూచించారు. విధుల్లో నిబద్ధతతో పనిచేసే సిబ్బందిని ప్రత్యేకంగా ప్రోత్సహిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు నాణ్యమైన వైద్యం, విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి చెప్పారు. మార్చిలో ప్రారంభమయ్యే ఈ నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి డిసెంబర్ నాటికి ఆసుపత్రిని ప్రారంభించాలని కాంట్రాక్టర్‌కు స్పష్టం చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆరోగ్య శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# విప్లవోద్యమం లో "గణ"పతి

**ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత మావోయిస్టు దిక్సూచి గా ప్రస్థానం**

**కరీంనగర్ జిల్లా నుంచి నేపాల్ వరకు**



జగిత్యాల జిల్లా బీర్పూర్ మండల కేంద్రానికి (ఉమ్మడి కరీంనగర్ జిల్లా సారంగాపూర్ మండలం) చెందిన ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి 1949 జూన్ 16న బీర్పూర్‌లో జన్మించారు. అక్కడే ఏడో తరగతి వరకు చదివారు. జగిత్యాల, కరీంనగర్‌లో ఉన్నత విద్యాభ్యాసం పూర్తి చేశారు. అనంతరం ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొంది ప్రస్తుత జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం గోవిందారంతోపాటు, పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పని చేశారు. 1972-73 ప్రాంతంలో బీఈడీ ట్రైనింగ్ కోసం వరంగల్ వెళ్లి అజ్ఞాతం బాట పట్టారు. 1976 మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తబలాపూర్‌లోని భూస్వామి పితాంబరరావును హతమార్చిన కేసులో జన్నారం పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదు కాగా.. లక్ష్మణరావును పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నిజామాబాద్ జైలులో శిక్ష అనుభవించి మూడు నెలల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన ఆయన అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లారు. 1978 సెప్టెంబర్ 9న ఆ తర్వాత జగిత్యాల పట్టణంలో కొండపల్లి సీతారామయ్య నేతృత్యంలో జగిత్యాల జైతాయాత్ర చేశారు. ఈ జైత్రయాత్రలో మల్లోజుల కోటేశ్వరరావు, నల్లా ఆదిరెడ్డి, శీలం నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

**సంచలనాలకు కేంద్ర బిందువు..**

ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి సంచనాలకు కేంద్ర బిందువు. రాజకీయ సిద్ధాంతం నుంచి పూర్తిగా మిలిటరీ యాక్షన్‌లోకి దిగిన సందర్భం వరకూ ఆయనే పార్టీకి రథసారథి. పీపుల్స్ వార్ గ్రూప్‌ను తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా మరో సాయుధ కమ్యూనిస్టు పార్టీ మావోయిస్ట్ కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియాతో కలిపి సీపీఐ (మావోయిస్టు)గా మారడానికి విశేష కృషి చేశారు. ఆయన సారథ్యంలో పార్టీ ప్రభుత్వాలకు ముచ్చెమటలు పట్టించింది. రెడ్ కారిడార్ వంటి వ్యూహాత్మక నిర్దేశాలతోపాటు పీఎల్‌జీఏ వంటి గెరిల్లా నిర్మాణాలకు నాంది పలికారు. 2018 తర్వాత పార్టీ బాధ్యతల నుంచి తప్పుకుని సలహాదారుగా మాత్రమే కొనసాగుతున్నారు. అయితే, గత కొంతకాలంగా పార్టీ కోలుకోలేని విధంగా తగులుతున్న ఎదురుదెబ్బలతో కేడర్ నేలకూలడం, కొందరు ముఖ్యనేతలు లొంగిపోవడంతో ఇప్పుడు ఆయన గురించిన ప్రశ్నలు అందరిలోనూ మెదులుతున్నాయి. గురువారం గణపతి ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో లొంగిపోతారని వస్తున్న వార్తలు అందరిలోనూ ఉత్కంఠను రేపుతున్నాయి. ఆయన ఎక్కడ ఉన్నారు? ఆయన ఎలా ఉంటారు? అన్న ఆసక్తి అందరిలో నెలకొన్నది. ముఖ్యంగా ఆయన స్వస్థలమైన కరీంనగర్ జిల్లాలో ఈ వార్తలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**విప్లవ చరిత్రలో కీలకంగా..**

ముప్పాళ్ల లక్ష్మణరావు అలియాస్ గణపతి మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శిగా ఉన్న 1992 నుంచి 2018 వరకు ఉన్న కాలం భారత విప్లవ చరిత్రలో అత్యంత కీలకమైనది. ఆయన నేతృత్వంలో పార్టీ అనేక వ్యూహాత్మక మార్పులకు, సంచలన ఘటనలకు సాక్షిగా నిలిచింది. 2004లో దేశంలో అతిపెద్ద సాయుధ కమ్యూనిస్టు పార్టీలైన పీపుల్స్ వార్ గ్రూప్, మావోయిస్ట్ కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియాలు ఒక్కటై సీపీఐ (మావోయిస్టు)గా ఏర్పడింది. ఇది గణపతికి అతిపెద్ద వ్యూహాత్మక విజయం. దీనివల్ల ఉత్తర, దక్షిణ భారతదేశాల్లోని విప్లవ శక్తులు ఏకమయ్యాయి. పశుపతి (నేపాల్) నుంచి తిరుపతి (ఆంధ్రప్రదేశ్) వరకు ఒకే గొలుసుకట్టుగా అటవీ ప్రాంతాన్ని ప్రభావితం చేస్తూ 'రెడ్ కారిడార్'ను బలోపేతం చేశారు. పార్టీకి ఒక పటిష్టమైన సైనిక విభాగం ఉండాలని పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ)ని స్థాపించి.. గెరిల్లా సైన్యంగా అత్యాధునిక శిక్షణ ఇచ్చారు. ఆయన నేతృత్వంలో మావోయిస్టులు ప్రభుత్వ వ్యవస్థలను కుదిపేశారు. అందులో కొన్ని ప్రధాన సంఘటనలు..

**చంద్రబాబు నాయుడుపై అలిపిరి దాడి (2003)**

మావోయిస్టు చరిత్రలో ఇది అత్యంత ధైర్యసాహసాలతో కూడిన దాడిగా భావిస్తారు. అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తిరుమల వెళ్తుండగా అలిపిరి వద్ద మ్యాగ్నెటిక్ మైన్లతో పేల్చివేశారు. ఈ ఘటనలో ఆయన తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు.

**బలిమెల దాడి (2008)**

ఒడిశాలోని బలిమెల జలాశయంలో గ్రేహౌండ్స్ పోలీసుల బోటును ముంచివేసి దాదాపు 38 మంది జవాన్లను చంపడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఇది గెరిల్లా యుద్ధతంత్రంలో ఒక పరాకాష్టగా నిలిచింది.

**చింతల్నార్ (దంతెవాడ) దాడి (2010)**

మావోయిస్టుల చరిత్రలో భద్రతా దళాలపై జరిగిన అతిపెద్ద దాడి ఇది. ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ జిల్లా చింతల్నార్ వద్ద జరిగిన మాటు దాడిలో ఒకేసారి 76 మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారు. అప్పుడు గణపతి నేతృత్వంలోని సెంట్రల్ కమిటీ ఈ వ్యూహాన్ని రచించింది.

**జిరం లోయ దాడి (2013)**

ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలో కాంగ్రెస్ నాయకుల కాన్వాయ్‌పై జరిగిన ఈ దాడిలో మహేంద్ర కర్మ, విద్యాచరణ్ శుక్లా వంటి అగ్రనేతలు సహా 27 మంది మరణించారు. సల్వాజుడుం వంటి కౌంటర్ ఇన్సర్జెన్సీ గ్రూపులను అణచివేయడమే లక్ష్యంగా ఈ దాడి జరిగింది.

**వెంటాడిన వైఫల్యాలు**

గణపతి హయాంలో పార్టీ ఎంతో బలోపేతమైనా, అదే కాలంలో గ్రేహౌండ్స్, కోబ్రా దళాల వ్యూహాల వల్ల పార్టీ పట్టు కోల్పోయింది. 2004 చర్చల వైఫల్యం తర్వాత మావోయిస్టులకు ఆయువుపట్టులా ఉన్న ఆంధ్రప్రదేశ్‌లో పార్టీ తుడిచిపెట్టుకుపోయింది. నల్లమల అడవులపై ప్రభుత్వం ఆధిపత్యం సాధించింది. ఆజాద్, కిషన్ జీ వంటి కీలక నేతలను కోల్పోవడం పార్టీని ఆత్మరక్షణలో పడేసింది. గణపతి నాయకత్వం నుంచి తప్పుకున్న తర్వాత పార్టీ తన ఉనికిని చాటుకోవడానికి చాలా ఇబ్బందులు పడింది. ప్రస్తుతం ఆయన లొంగుబాటు అనేది ఒక సుదీర్ఘ పోరాట యుగం ముగింపుగా నిపుణులు భావిస్తున్నారు.

**కుటుంబానికి దూరంగానే..**

భూస్వామ్య కుటుంబంలో జన్మించిన ముప్పాళ్ల లక్ష్మణరావు సామాజిక అసమానతల నేపథ్యంలో సఉద్యమ బాట పట్టారు. వామపక్ష భావజాలం కలిగిన గణపతి మావోయిస్టు ఉద్యమం వైపు ఆకర్షతుడై భార్య విజయ, కొడుకు శ్రీనివాస్‌ను వదిలిపెట్టి అజ్ఞాత జీవితంలోకి వెళ్లారు. తదనంతరం ఆయన భార్య, కొడుకు అమెరికా వలస వెళ్లినట్లు వారి బంధువుల ద్వారా తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన భార్య క్యాన్సర్ బారిన పడి హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా కొడుకు శ్రీనివాస్ అమెరికాలో ఉంటున్నారు.

**విప్లవ ప్రస్థానం ఇలా.**

1949, జూన్ 16 : తెలంగాణలోని కరీంనగర్ జిల్లా (ప్రస్తుతం జగిత్యాల జిల్లా) సారంగాపూర్ మండలం బీర్పూర్ గ్రామంలో జన్మించారు. విద్య, ఉద్యోగం : సైన్స్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి, వరంగల్‌లో బీఈడీ చేశారు. కొంతకాలం కరీంనగర్ జిల్లాలో ఉపాధ్యాయుడిగా పనిచేశారు. అందుకే ఆయనను పార్టీలో అందరూ 'సార్' అని ఆత్మీయంగా పిలుస్తుంటారు. 1970 ప్రారంభం : వరంగల్‌లో ఉన్నత విద్య చదువుతున్న సమయంలో మావోయిస్టు నేతలు కొండపల్లి సీతారామయ్య, నల్లా ఆదిరెడ్డిల పరిచయంతో విప్లవ భావజాలం వైపు ఆకర్షితులయ్యారు. 1976 : ఉపాధ్యాయ వృత్తిని వదిలి పూర్తిగా అండర్ గ్రౌండ్ (అజ్ఞాతం)లోకి వెళ్లారు. పీపుల్స్ వార్ గ్రూప్‌లో క్రియాశీలక సభ్యుడిగా మారారు. 1992, జూన్ : పీపుల్స్ వార్ పార్టీలో అంతర్గత సంక్షోభం ఏర్పడింది. పార్టీ వ్యవస్థాపకుడు కొండపల్లి సీతారామయ్యను బహిష్కరించిన తర్వాత.. గణపతి ఆ పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. 2004, సెప్టెంబర్ 21 : భారతదేశ మావోయిస్టు చరిత్రలో ఇది కీలక మలుపు. పీపుల్స్ వార్ గ్రూప్, మావోయిస్ట్ కమ్యూనిస్ట్ సెంటర్ ఆఫ్ ఇండియా (ఎంసీసీఐ) విలీనమై సీపీఐ (మావోయిస్ట్) పార్టీగా ఏర్పడ్డాయి. ఈ నూతన పార్టీకి వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శిగా గణపతి బాధ్యతలు చేపట్టారు. 2018, నవంబర్ : వయసు పెరగడం, అనారోగ్య కారణాల వల్ల ప్రధాన కార్యదర్శి పదవికి రాజీనామా చేశారు. తన బాధ్యతలను నంబాల కేశవరావు (బసవరాజ్)కు అప్పగించి, పార్టీ సలహాదారుడిగా కొనసాగారు.

# ఘనంగా భట్టి విక్రమార్క కుమారుడి వివాహం

**- హైదరాబాద్‌లో వైభవంగా వేడుకలు**

**- ముఖ్యమంత్రి, మంత్రుల హాజరు - రాజకీయ, సినీ ప్రముఖుల సందడి**



**హైదరాబాద్, 5 మార్చి**

తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య వివాహం సాక్షితో హైదరాబాద్‌లో ఘనంగా జరిగింది. శంషాబాద్ సమీపంలోని ప్రముఖ వేదికలో జరిగిన ఈ వివాహ వేడుకకు రాష్ట్ర రాజకీయ, సామాజిక మరియు సినీ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరయ్యారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు మరియు ఆహ్వానితుల సమక్షంలో సంప్రదాయ పద్ధతుల్లో వివాహ కార్యక్రమం నిర్వహించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ హాజరై నూతన దంపతులను ఆశీర్వదించారు. రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమం రాజకీయ నాయకులతో పాటు వివిధ రంగాల ప్రముఖులతో కళకళలాడింది. ఈ వివాహ వేడుకకు సినీ రంగానికి చెందిన ప్రముఖులు కూడా హాజరై దంపతులను ఆశీర్వదించారు. ప్రముఖ నటులు చిరంజీవి, ప్రకాశ్ రాజ్ వంటి వారు కార్యక్రమానికి హాజరైనట్లు సమాచారం. వారి రాకతో వేడుకకు మరింత ప్రత్యేకత ఏర్పడింది. వివాహ కార్యక్రమం సంప్రదాయ ఆచారాలు, మంగళవాయిద్యాల నడుమ వైభవంగా జరిగింది. అతిథులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసి ఆతిథ్యాన్ని అందించారు. రాష్ట్రవ్యాప్తంగా నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, ఆహ్వానితులు కార్యక్రమంలో పాల్గొని నూతన దంపతులకు ఆశీస్సులు అందించారు. కుటుంబ సభ్యులు ఈ వేడుకను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు

# హిమాయత్‌సాగర్ పరిసరాల్లో అక్రమ మైనింగ్

## - 'మరో KGF'లా ప్రకృతి వనరుల దోపిడీ

**: ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్**

**హైదరాబాద్, 5 మార్చి**



హిమాయత్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న అక్రమ మైనింగ్, క్రషర్ యూనిట్ల కార్యకలాపాలపై బీఆర్‌ఎస్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ పరిశీలన నిర్వహించినట్లు ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ తెలిపారు. హిమాయత్‌సాగర్ ప్రాంతంలోని సర్వే నంబర్లు 66, 67, 68, 69లో నడుస్తున్న క్రషర్ యూనిట్లను బృందం ప్రత్యక్షంగా పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ ఫ్యాక్ట్ ఫైండింగ్ బృందంలో ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ కుమార్‌తో పాటు పార్టీ జనరల్ సెక్రటరీ డా. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్, రాజేంద్రనగర్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లొళ్ల కార్తీక్ రెడ్డి, ఎస్సీ--ఎస్టీ కమిషన్ మాజీ ఛైర్మన్ డా. ఎర్రోళ్ల శ్రీనివాస్, కార్పొరేషన్ మాజీ ఛైర్మన్లు డా. క్రిశాంక్, డా. వాసుదేవ రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్రాచారి, కే. కిషోర్ గౌడ్, బీఆర్‌ఎస్ నాయకుడు అభిలాష్ రంగినేని పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. దాసోజు శ్రవణ్ మాట్లాడుతూ, అక్కడ జరుగుతున్న పరిస్థితులు చూస్తుంటే ఖ+ఫీ సినిమా గుర్తుకు వచ్చిందన్నారు. భూమాతను చెరబట్టి ప్రకృతి వనరులను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. కొండలను బద్దలు కొట్టి గుట్టల కొద్దీ సంపదను దోచుకుంటున్నారని, ఇక్కడ మైనింగ్ కార్యకలాపాలు మరో ఖ+ఫీను తలపించేలా సాగుతున్నాయని వ్యాఖ్యానించారు. ఈ ప్రాంతం ట్రిపుల్ వన్ (+ూ 111) పరిధిలోకి వస్తుందని, ఇక్కడ ఎలాంటి మైనింగ్ కార్యకలాపాలు జరగకూడదని స్పష్టం చేశారు. అయితే అన్ని నియమ నిబంధనలకు తూట్లు పొడిచి అక్రమంగా క్రషర్ యూనిట్లు నడుపుతున్నారని ఆయన ఆరోపించారు. స్థానిక ప్రజలు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు స్పందించలేదని తెలిపారు. క్రషర్ యూనిట్ల నిర్వహణకు అనేక అనుమతులు అవసరమని ఆయన పేర్కొన్నారు. మైనింగ్ లీజు, క్వారీ పర్మిట్, గ్రామ పంచాయతీ నుంచి ఎన్‌వోసీ, పర్యావరణ శాఖ అనుమతులు, భూగర్భ జలవనరుల శాఖ అనుమతులు వంటి కీలక అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. సాధారణంగా కనీసం తొమ్మిది రకాల అనుమతులు పొందిన తర్వాత మాత్రమే క్రషర్ యూనిట్ ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అయితే ఈ ప్రాంతంలో నడుస్తున్న యూనిట్లకు ఈ అనుమతుల్లో చాలా వరకు లేవని తెలిపారు. ఎప్పుడో మూతపడిన క్రషర్ యూనిట్‌ను మళ్లీ ప్రారంభించారని, దానికి లీజు ట్రాన్స్‌ఫర్ ఎవరు చేశారు? ఎవరు అనుమతి ఇచ్చారు? అనే విషయాలను ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఓఆర్‌ఆర్‌కు కిలోమీటర్ పరిధిలో ఎలాంటి మైనింగ్ కార్యకలాపాలు ఉండకూడదని నిబంధనలు ఉన్నాయని, అయితే ఇక్కడ ఓఆర్‌ఆర్‌కు కిలోమీటర్ కన్నా తక్కువ దూరంలోనే క్రషర్ యూనిట్లు ఎలా ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. ఈ సందర్భంగా రాజేంద్రనగర్ పరిధిలోని మానస హిల్స్ ప్రాంతంలో రాఘవ కన్స్ట్రక్షన్స్ సంస్థ నిర్వహిస్తున్న స్టోన్ క్రషర్ మరియు రెడీ మిక్స్ కాంక్రీట్ (=వీజ) ప్లాంట్ కార్యకలాపాలపై కూడా ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన ఈ సంస్థ, కేబినెట్ మంత్రి హోదాను అడ్డం పెట్టుకుని అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని ఆరోపించారు. పేదలకు కేటాయించిన అసైన్డ్ భూముల్లోనే ఈ యూనిట్ నడుస్తోందని తెలిపారు. అసైన్డ్ భూముల చట్టం ప్రకారం ఈ భూములను ఎవరికీ బదిలీ చేయకూడదని, లీజుకు ఇవ్వకూడదని, పారిశ్రామిక అవసరాలకు ఉపయోగించకూడదని ఆయన గుర్తు చేశారు. అయితే ఆ నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ కొండలను పిండిచేస్తూ విలువైన ఖనిజ సంపదను దోచుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (గ్రాజదీ) మరియు మైనింగ్ శాఖ నిబంధనల ప్రకారం స్టోన్ క్రషర్ యూనిట్ నిర్వహించాలంటే అనేక అనుమతులు తప్పనిసరి అని తెలిపారు. వాటిలో జుజు (జశీఅంవత్ శీ జుర్ఝఎశ్రీఅంష్ట్ర), జూ (జశీఅంవత్ శీ ాజూవత్ఝ్వ), మైనింగ్ లీజు లేదా క్వారీ పర్మిట్, గ్రామ పంచాయతీ చీూజ, పర్యావరణ క్లియరెన్స్, భూగర్భ జలాల వినియోగ అనుమతి, పరిశ్రమల శాఖ రిజిస్ట్రేషన్, సైట్ ప్లాన్ మరియు సాంకేతిక నివేదిక, పరిశ్రమల విద్యుత్ కనెక్షన్ వంటి అనుమతులు ఉండాలని పేర్కొన్నారు. అయితే రాఘవ కన్స్ట్రక్షన్స్ ఈ అనుమతుల్లో ఏ ఒక్కదానికీ సంబంధించి సరైన ఆధారాలు లేవని ఆరోపించారు. దీనివల్ల అక్కడ నడుస్తున్న స్టోన్ క్రషర్ యూనిట్ మరియు =వీజ ప్లాంట్ పూర్తిగా అక్రమమని తెలిపారు. ఇది పర్యావరణ పరిరక్షణ చట్టాలు, మైనింగ్ నిబంధనలు మరియు తెలంగాణ అసైన్డ్ భూముల చట్టం యొక్క తీవ్రమైన ఉల్లంఘన అని పేర్కొన్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం అక్కడ సుమారు 8 లక్షల టన్నుల రాయిని తవ్వి తీసినట్లు తెలుస్తోందని తెలిపారు. టన్నుకు రూ.167 సీనరేజ్ ఫీజు ప్రకారం ప్రభుత్వానికి కనీసం రూ.14.36 కోట్ల ఆదాయం ఎగవేయబడిందని, ఇతర చార్జీలతో కలిపి మొత్తం సుమారు రూ.15.23 కోట్ల నష్టం ప్రభుత్వానికి వాటిల్లిందని పేర్కొన్నారు. మైనింగ్ నిబంధనల ప్రకారం అక్రమ తవ్వకాలకు రాయల్టీకి పది రెట్లు వరకు జరిమానా విధించే అవకాశం ఉందని, ఆ ప్రకారం ఈ కేసులో రూ.150 కోట్లకు పైగా జరిమానా విధించాల్సి ఉంటుందని తెలిపారు. రేవంత్ రెడ్డి పాలనలో తెలంగాణ ప్రకృతి వనరుల దోపిడీకి కేంద్రంగా మారిందని, అటు రేవంత్ రెడ్డి, ఇటు పొంగులేటి కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని తీవ్రంగా విమర్శించారు. మంత్రి అయినా, మరెవరైనా సరే అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, వెంటనే పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ డా. దాసోజు శ్రవణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు



## యుద్ధ సన్నివేశాల్లో దెబ్బలు తగిలాయి

అందంతోపాటు అభినయపరంగానూ ప్రేక్షకుల అభినందనలందుకుంటున్నది మలయాళ మందారం సంయుక్త మీనన్. ఆమె నిఖిల్‌కి జోడీగా నటించిన పానిండియా సినిమా 'స్వయంభు' ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ చారిత్రాత్మక చిత్రంలో సంయుక్త యువరాణిగా కనిపించనున్నది. ఈ పాత్రకోసం కత్తిసాము, కర్రసాము తదితర యుద్ధ విద్యాలతోపాటు గుర్రపు స్వారీని కూడా నేర్చుకున్నది సంయుక్త. ఈ పాత్ర గురించి సంయుక్త మీనన్ మాట్లాడుతూ ' 'స్వయంభు' ఓ కొత్త ప్రపంచం.ప్రేక్షకుల్ని కొన్ని శతాబ్దాల వెనక్కి తీసుకెళ్లే సినిమా ఇది. ఇందులో నేను యోధురాలిగా కనిపిస్తా. ఈ సినిమా కోసం భయంకరమైన యుద్ధ సన్నివేశాల్లో నటించా. ఈ క్రమంలో దెబ్బలు కూడా తగిలాయి. కానీ స్క్రీన్‌పై నా కష్టాన్ని చూసుకున్నాక బాధలన్నీ మరిచిపోయా. ఇందులో నేను పోషించిన యువరాణి పాత్రను దర్శకుడు భరత్‌కృష్ణమాచార్య అద్భుతంగా మలిచారు. ఈ సినిమా తర్వాత ఆయన గొప్ప స్థాయిలో ఉంటారు. నిఖిల్‌తోపాటు మా అందరి కెరీర్లకూ ఈ సినిమా ఓ మైలురాయిలా నిలుస్తుంది' అని నమ్మకం వెలిబుచ్చింది సంయుక్త మీనన్. రామ్‌చరణ్ పానిండియా సినిమా 'పెద్ది'లో కూడా కథను మలుపుతిప్పే ఓ కీలక పాత్రలో సంయుక్త నటించినట్టు వార్తలొస్తున్నాయి. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది.

# పవర్ తుఫాన్ ముందే వస్తోంది..

థియేటర్లలో పవర్ తుఫాన్ కాస్త ముందుగానే రానుంది. సినీ ప్రియులంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్న పవన్‌కల్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా అనుకున్న



దానికంటే ముందుగానే.. అంటే, ఈ నెల 19వ తేదీనే విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ గురువారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. వరుసగా లాంగ్ వీకెండ్లు, దాదాపు రెండు వారాలపాటు ఉండే సెలవల్ని దృష్టిలో పెట్టుకొని నిర్మాతలు ఈ నిర్ణయాన్ని తీసుకున్నట్టు ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే.. ఈ చిత్రం పాటలను దేవిశ్రీప్రసాద్ స్వరపరచగా, నేపథ్యసంగీతాన్ని ఎస్.తమన్ అందించడం విశేషం. ఆలస్యాన్ని నివారించేందుకు, పనులన్నీ సజావుగా సాగేందుకు, పరస్పర చర్చల అనంతరం తీసుకున్న నిర్ణయం ఇదని, సినిమా ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకొనే ఈ నిర్ణయం తీసుకున్నామని మేకర్స్ తెలిపారు. 'గబ్బర్‌సింగ్' తర్వాత దర్శకుడు హరీశ్‌శంకర్, పవన్‌కల్యాణ్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. పవర్‌స్టార్ ఫ్యాన్స్‌కు విందుభోజనం లాంటి సినిమా ఇదని, 'ఉస్తాద్ భగత్‌సింగ్'గా పవన్‌కల్యాణ్‌లోని కొత్తకోణాన్ని చూస్తారని మేకర్స్ చెబుతున్నారు. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలుగా నటించిన ఈ చిత్రానికి కథనం: కె.దశరథ్, రమేశ్‌రెడ్డి, నిర్మాతలు: నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, నిర్మాణం: మైత్రీ మూవీమేకర్స్.

# సెమీస్‌లో ఇంగ్లండ్‌పై భారత్ అద్భుత విజయం

**- శాంసన్ మరో సూపర్ ఇన్నింగ్స్ - రాణించిన దూబె, బుమ్రా - బెతెల్ శతక పోరాటం వృథా**



ముంబై: టీ20 ప్రపంచకప్‌లో డిఫెండింగ్ చాంపియన్ టీమ్‌ఇండియా వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. బౌలర్లకు పీడకల మిగిల్చిన వాంఖడేలో బ్యాటర్లు వీరవిహారం చేసిన వేళ.. ఇంగ్లండ్‌పై భారత్‌దే పైచేయి అయింది. ఇరుజట్ల మధ్య ఇక్కడ జరిగిన రెండో సెమీస్‌లో మెన్ ఇన్ బ్లూ.. 7 పరుగుల తేడాతో విజయం సాధించింది. హైస్కోరింగ్ థ్రిల్లర్‌గా సాగిన పోరులో టీమ్‌ఇండియా నిర్దేశించిన 254 పరుగుల రికార్డు ఛేదనలో ఇంగ్లండ్.. 20 ఓవర్లకు 246/7 వద్దే ఆగిపోయింది. జాకబ్ బెతెల్ (48 బంతుల్లో 105, 8 ఫోర్లు, 7 సిక్సులు) వీరోచిత శతకాని తోడు విల్ జాక్స్ (20 బంతుల్లో 35, 4 ఫోర్లు, 2 సిక్సులు) పోరాడటంతో ఆ జట్టు గెలుపునకు చేరువగా వచ్చింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన భారత్.. సంజూ శాంసన్ (42 బంతుల్లో 89, 8 ఫోర్లు, 7 సిక్సులు), శివమ్ దూబె (25 బంతుల్లో 43, 1 ఫోర్, 4 సిక్సులు), ఇషాన్ కిషన్ (18 బంతుల్లో 39, 4 ఫోర్లు, 2 సిక్సులు) రాణించడంతో నిర్ణీత ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 253 రన్స్ చేసింది. శాంసన్‌కే 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' దక్కింది.

**భయపెట్టిన బెతెల్**

ఛేదనలో ఇంగ్లండ్ సాల్ట్ (5), బ్రూక్ (7) వికెట్లను త్వరగానే కోల్పోయినా ఆ జట్టు వెనుకడుగు వేయలేదు. యువ బ్యాటర్ బెతెల్ ధనాధన్ మెరుపులతో విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడి భారత్‌ను భయపెట్టాడు. జాక్స్‌తో కలిసి అతడు భారత బౌలర్లను ఆటాడుకున్నాడు. ముఖ్యంగా స్పిన్నర్లకు ఈ జోడీ చుక్కలు చూపించి దొరికిన బంతిని దొరికినట్టుగా బాది టీమ్‌ఇండియా అభిమానులను ఆందోళనకు గురిచేసింది. బట్లర్ (17 బంతుల్లో 25, 4 ఫోర్లు, 1 సిక్స్) గత మ్యాచ్‌లతో పోలిస్తే కాస్త బెటర్‌గానే ఆడినా వరుణ్ ఓవర్లో క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. కానీ అదే ఓవర్లో హ్యాట్రిక్ సిక్సులతో పరుగుల వేట మొదలుపెట్టిన బెతెల్.. ఆకాశమే హద్దుగా రెచ్చిపోయాడు. బట్లర్ స్థానంలో వచ్చిన టామ్ బ్యాంటన్ (17) రెండు సిక్సులు, ఓ ఫోర్‌తో దూకుడుగా ఆడేందుకు యత్నించినా అక్షర్ అతడికి చెక్ పెట్టాడు. కానీ అతడి నిష్క్రమణ తర్వాత క్రీజులోకి వచ్చిన జాక్స్‌తో కలిసి బెతెల్ దూకుడుగా ఆడారు. 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీని పూర్తిచేసిన బెతెల్.. ఆ తర్వాత మరింత జోరు పెంచడంతో లక్ష్యం వడివడిగా కరిగిపోయింది. మరో ఎండ్‌లో జాక్స్ కూడా ధాటిగా ఆడటంతో 13 ఓవర్లకే ఇంగ్లండ్ 150 రన్స్ దాటేసింది. ఈ జోడీ బాదుడుతో ఆ జట్టు 12 రన్‌రేట్‌తో లక్ష్యం దిశగా దూసుకొచ్చింది.

**మలుపు తిప్పిన అక్షర్ క్యాచ్**

లక్ష్యం దిశగా సాగుతున్న ఇంగ్లండ్‌కు అర్ష్‌దీప్ షాకిచ్చాడు. అతడి 14వ ఓవర్లో ఆఖరి బంతికి ఆఫ్‌సైడ్‌కు దూరంగా వెళ్తున్న బంతిని వేటాడిన జాక్స్.. డీప్ పాయింట్‌లో అక్షర్ మరో అద్భుతమైన క్యాచ్‌తో అతడి కథ ముగిసింది. మ్యాచ్‌లో ఇదే మలుపు. ఇక ఆఖరి ఐదు ఓవర్లలో ఆ జట్టు విజయానికి 69 రన్స్ అవసరమవగా 16, 18 ఓవర్లలో ఆ జట్టును కట్టడి చేసి 14 రన్స్ మాత్రమే ఇచ్చాడు. హార్దిక్ 19వ ఓవర్లో తొలి బంతికి సిక్స్‌తో 45 బంతుల్లోనే బెతెల్ శతకం పూర్తయింది. కానీ మూడో బంతికి కరన్ ఇచ్చిన క్యాచ్‌ను బౌండరీ లైన్ వద్ద తిలక్ ఒడిసిపట్టగా ఆ ఓవర్లోనూ 9 పరుగులే వచ్చాయి. ఆరు బంతుల్లో 30 పరుగులు కావాల్సి ఉండగా దూబె ఓవర్లో తొలి బంతికి రెండు రన్స్ తీయబోయిన బెతెల్.. హార్దిక్ సూపర్ త్రో తో రనౌట్ అవడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. ఆర్చర్ మూడు సిక్సులు కొట్టినా అవి ఆ జట్టు ఓటమి అంతరాన్ని తగ్గించాయి.

**శాంసన్, దూబె మెరుపులు**

టోర్నీ ఆసాంతం దారుణంగా విఫలమవుతున్న అభిషేక్ (9) మళ్లీ తొందరపాటుతో వికెట్‌ను సమర్పించుకున్నాడు. స్పిన్‌లో విఫలమవుతున్న అతడి బలహీనతను ఆసరాగా చేసుకున్న బ్రూక్.. రెండో ఓవర్లోనే జాక్స్‌కు బంతినివ్వగా అతడు ఫలితం రాబట్టాడు. వెస్టిండీస్‌తో గత మ్యాచ్‌లో కెరీర్ బెస్ట్ ఇన్నింగ్స్ ఆడిన శాంసన్ మరోసారి దుమ్మురేపాడు. అభిషేక్ త్వరగానే నిష్క్రమించినా.. ఇషాన్ కిషన్ అండతో అతడు రెచ్చిపోయాడు. 15 పరుగుల వద్ద బ్రూక్ క్యాచ్ మిస్ చేయడంతో బతికిపోయిన సంజూ.. ఆ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాడు. ముఖ్యంగా గతంలో షార్ట్‌పిచ్ బంతులతో తనను ఇబ్బందిపెట్టిన జోఫ్రా ఆర్చర్‌ను లక్ష్యంగా చేసుకుని భారీ షాట్లు ఆడాడు. కిషన్, శాంసన్ ధాటిగా ఆడటంతో పవర్ ప్లేలోనే భారత్ 67/1తో నిలిచింది. డాసన్ 8వ ఓవర్లో నాలుగో బంతిని లాంగాఫ్ మీదుగా భారీ సిక్స్‌తో 26 బంతుల్లో శాంసన్ ఈ టోర్నీలో వరుసగా రెండో ఫిఫ్టీని సాధించాడు. కరన్ వేసిన 9వ ఓవర్లోనూ ఈ జోడీ 20 రన్స్ రాబట్టింది. రెండో స్పెల్‌కు వచ్చిన రషీద్.. పదో ఓవర్లో ఇషాన్‌ను ఔట్ చేయడంతో 97 పరుగుల రెండో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. బ్యాటింగ్ ఆర్డర్‌లో ప్రమోట్ అయిన దూబె.. రషీద్ 12వ ఓవర్లో రెండు భారీ సిక్సులతో అలరించాడు. ఆర్చర్ ఓవర్లో రెండు సిక్సులతో శతకానికి చేరువైన శాంసన్.. జాక్ 14వ ఓవర్లో ఆఫ్‌సైడ్ ఆవలగా వెళ్తున్న బంతిని వేటాడి డీప్ కవర్స్‌లో సాల్ట్ చేతికి చిక్కి సెంచరీ చేజార్చుకున్నాడు. కెప్టెన్ సూర్య (11) నిరాశపరిచినా దూబె, హార్దిక్ (12 బంతుల్లో 27, 3 ఫోర్లు, 2 సిక్సులు) దూకుడుతో 17 ఓవర్లకే టీమ్‌ఇండియా 200 పరుగుల మార్కును దాటింది. హార్దిక్‌తో సమన్వయం లోపించడంతో దూబె రనౌట్ అయ్యాడు. ఆఖర్లో తిలక్ వర్మ (7 బంతుల్లో 21, 3 సిక్సులు) ఆర్చర్ బౌలింగ్‌లో మూడు సిక్సులు బాది నిష్క్రమించినా ఆఖరి ఓవర్లో హార్దిక్ రెండు సిక్సులతో భారత స్కోరును 250 దాటించాడు.

Printed, Published, Editor and owned by K.Koteshwar Rao, Ph.9052477378,#6-1-106, 1st Floor, shop No. 13&14&, near Post office Khairatabad, Hyderabad-04, T.S. RNI No. APTEL/2013/54465, Volme: 12, Issu:103